

ఆర్థిక రాజధానిగా విశాఖ

ఐటీ కేంద్రంగా, మెడికల్ డివైస్ తయారీ హబ్‌గా తీర్చిదిద్దుతాం

ఫ్లై ఓవర్లు, అండర్ బ్రిడ్జిలు నిర్మించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం







చిట్టివలస ఫుట్‌బాల్ మైదానంలో శంఖారావం సభకు హాజరైన జనం

- ఏటా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీల భర్తీ
- ఉద్యోగం వచ్చేంత వరకూ నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తాం
- భీమిలితో నాకు ప్రత్యేక అనుబంధం
- గత ఎన్నికల్లో ఇక్కడ నుంచి పోటీ చేయాలని చంద్రబాబునాయుడు చెప్పారు
- చిట్టివలస శంఖారావం సభలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్
- మోస్ట్ హ్యాపెనింగ్ సిటీని విషాద నగరంగా మార్చిన ఘనత జగన్‌దేనంటూ ధ్వజం

విశాఖపట్నం, భీమునిపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరాన్ని ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. గతంలో తాను ఐటీ శాఖా మంత్రిగా ఉన్నప్పుడు నగరానికి అనేక పరిశ్రమలు తీసుకువచ్చానని గుర్తుచేశారు. శనివారం సాయంత్రం భీమిలి నియోజకవర్గ పరిధిలోని చిట్టివలస ఫుట్‌బాల్ మైదానంలో నిర్వహించిన శంఖారావం సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

మోస్ట్ హ్యాపెనింగ్ సిటీగా ఒకప్పుడు పేరుగాంచిన విశాఖను జగన్‌రెడ్డి విషాద నగరంగా మార్చేశాడన్నారు. అభివృద్ధిలో అంతర్జాతీయ ఖ్యాతిని ఒకప్పుడు తెస్తే... ఇప్పుడు ఇండియాకు గంజాయి క్యాపిటల్‌గా మార్చేశాడన్నారు. సొంత ఎంపీ కుటుంబ సభ్యులనే కిడ్నాప్ చేస్తే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు. విశాఖకు ఒక్క పరిశ్రమను తీసుకు రాకపోయినా.. రుషికొండకు గుండు కొట్టి ... మిగతా 6వ పేజీలో



చిట్టివలసలో మహిళలను ఆప్యాయంగా పలుకరిస్తున్న నారా లోకేశ్ - మరికొన్ని ఫొటోలు III పేజీలో

ఉత్తరాంధ్రకు పట్టిన దరిద్రం జగన్

- ఉత్తరాంధ్రను దోచుకునేందుకు సాయిరెడ్డి, సుబ్బారెడ్డి, బొత్సకు లైసెన్స్ ఇచ్చారు
- ఆయనపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి
- అవసరమైతే విశాఖ ఉక్కును రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది
- అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో టిడ్కో ఇళ్లు
- టీడీపీ, జనసేన కేడర్ మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు
- ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- కృష్ణరాయపురం సభలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్

విశాఖపట్నం, పెందుర్తి, వేపగుంట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనపై ఉత్తరాంధ్ర ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనపై ఉత్తరాంధ్ర ప్రజలు గర్జిస్తున్నారన్నారు. పోరాటాల పురిటిగడ్డ ఉత్తరాంధ్ర అని పేర్కొంటూ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ ఇక్కడ ప్రజలతో జగన్ ఆటాడుకున్నారని, ఆయనతో ప్రజలు ఫుట్‌బాల్ ఆడే సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. శనివారం మధ్యాహ్నం విశాఖ జిల్లా పెందుర్తి మండలం కృష్ణరాయపురం ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన శంఖారావం సభలో ఆయన ప్రసంగించారు. చంద్రబాబు హయాంలో నగరానికి ఐటీ పరిశ్ర మలు, అదానీ డేటా సెంటర్, మెడ్‌టెక్ జోన్ తీసుకువచ్చారని, జగన్ పాలనలో భూకబ్జాలు, కిడ్నాప్‌లు, దోపిడీలు, చెరువుల ఆక్రమణలు జరుగుతున్నాయన్నారు. ఉత్తరాంధ్రకు పట్టిన దరిద్రం జగన్ అని వ్యాఖ్యానించారు. ఉత్తరాంధ్రను దోచుకునేందుకు బొత్స, విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి కుటుంబాలకు లైసెన్స్ ఇచ్చారన్నారు. వీరంతా పందికొక్కులా దోచుకున్నారని ఆరోపించారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలని జగన్ చూస్తున్నారని ఆరోపించారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం వచ్చిన వెంటనే విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. టీడీపీ, జనసేన కేడర్ మధ్య చిచ్చుపెట్టేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందన్నారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు.

సూపర్ సిక్స్ కరపత్రం చూపుతూ లోకేశ్ ప్రసంగం

జగన్‌ది రాజారెడ్డి రాజ్యాంగం

తాను బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి లోబడి పనిచేస్తానని, అదే జగన్ మాత్రం రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. తాను ప్రజల్లో తిరుగుతుంటే జగన్ మాత్రం పరదాల మాటున పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రిగా తాను టీసీఎల్, హెచ్‌సీఎల్, ఫాక్స్‌కాన్, జోహో... వంటి పరిశ్రమలు ... మిగతా 6వ పేజీలో



అక్కయ్యపాలెం గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో వైసీపీ భారీ జెండా

వైసీపీ నేతల ఇష్టారాజ్యం

- గ్రీన్‌బెల్ట్‌లో 60 అడుగుల స్థూపంపై వైసీపీ పతాకం
- నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు
- చోద్యం చూస్తున్న జీవీఎంసీ, ఎన్‌హెచ్‌ఏ అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అధికారం ఉంది కదా...అని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్‌ను ఇష్టారాజ్యంగా వాడుకుంటున్నారు. అక్కయ్యపాలెం జంక్షన్‌లో జాతీయ రహదారికి ఆనుకుని ఏకంగా 60 అడుగుల ఎత్తైన స్థూపాన్ని ఏర్పాటుచేసి వైసీపీ జెండాను ఆవిష్కరించడం నగరవాసులను విస్మయపరిచింది. గ్రీన్‌బెల్ట్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదనే నిబంధన ఉన్నప్పటికీ అటు జీవీఎంసీ అధికారులుగానీ ఇటు జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులుగానీ పట్టించుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. జీవీఎంసీలో వైసీపీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు దాదాపు రూ.ఐదు లక్షలు వెచ్చించి 60 అడుగుల స్థూపంతోపాటు భారీ వైకాపా జెండాను ఏర్పాటుచేశారు. శనివారం జరిగిన పతాక ఆవిష్కరణ కార్యక్రమానికి వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ముఖ్య అతిథులుగా హాజరై బాణాల శ్రీనివాసరావుని పొగడ్తలతో ముంచెత్తడం విశేషం. జీవనోపాధి కోసం గ్రీన్‌బెల్ట్‌లో ఎవరైనా చిన్నపాటి దుకాణం పెట్టుకుంటే తొలగించేదాకా ఊరుకోని జీవీఎంసీ అధికారులు ఒక పార్టీ పతాకం కోసం గ్రీన్‌బెల్ట్‌ను ధ్వంసం చేసినా పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



నేడు జనసేన అధినేత రాక

- నాయకులు, నియోజకవర్గ సమన్వయకర్తలతో భేటీ కానున్న పవన్‌కల్యాణ్
- ఒక్కొక్కరితో విడివిడిగా మాట్లాడతారని సమాచారం
- త్వరలో జిల్లాలో పర్యటన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆదివారం విశాఖపట్నం వస్తున్నారు. ఆయన హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు ప్రత్యేక విమానంలో నగరానికి చేరుకుని నోవాటెల్ హోటల్‌లో బస చేస్తారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలతో సమావేశం అవుతారు. అందరితో ఒకేసారి కాకుండా ఒక్కొక్కరితో విడివిడిగా మాట్లాడతారని సమాచారం.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా (విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి)లో మూడు లోక్‌సభ, 15 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. రాబోయే ఎన్నికల్లో జనసేన తరపున పోటీ చేసేందుకు చాలామంది ఉవ్విళ్లూరుతున్నారు. ఇటీవల కాలంలో సీనియర్ నాయకులు చాలామంది చేరారు. సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ఇటీవల పార్టీలో చేరారు. ఎటువంటి బాధ్యత ఇచ్చినా పనిచేస్తానని ప్రకటించారు. విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షునిగా పంచకర్ల రమేశ్‌బాబు ఉన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవం ఉంది. విశాఖ సిటీ అధ్యక్షునిగా ఇటీవలె ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఆయన భావిస్తున్నారు. ఇంకా శివశంకర్, బొలిశెట్టి సత్య, కోన తాతారావు వంటి నేతలు ఉన్నారు. అలాగే సుందరపు విజయకుమార్ (ఎలమంచిలి), పసుపులేటి ఉషాకిరణ్ (ఉత్తరం), పంచకర్ల సందీప్ (భీమిలి) వంటివారు నియోజకవర్గ సమన్వయకర్తలుగా ఉన్నారు. సామాజిక వర్గాల బలం, సీనియారిటీ...ఇలా అనేక అంశాలను పరిగణనలోకి తీసుకొని అవకాశం కల్పించాలని పార్టీ అధినేత ఆలోచన. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన మధ్య పొత్తు కుదిరింది. బీజేపీ కూడా రేపో మాపో కూటమిలో చేరనున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఎవరికి ఎన్ని సీట్లు, ఎక్కడ అనేది ఇంకా ఖరారు కాలేదు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ విశాఖపట్నం వస్తున్నారు. టికెట్లు ఆశిస్తున్న వారితో పాటు నియోజకవర్గ సమన్వయకర్తలను నోవాటెల్ హోటల్‌కు రావాలని పార్టీ కార్యాలయం నుంచి పిలుపు వచ్చింది. ఎంతమందికి పోటీ చేసే అవకాశం వస్తుంది?, రాని వారు ఏమి చేయాలి?, భవిష్యత్తులో వారికి లభించే ప్రాధాన్యం ఏమిటి?, ఈ కీలక సమయంలో పొత్తు పెట్టుకునే పార్టీలతో సమన్వయం చేయాల్సిన ఆవశ్యకత వంటి విషయాలను పవన్‌కల్యాణ్ వివరిస్తారని తెలుస్తోంది. అదేవిధంగా పవన్‌కల్యాణ్ ఉమ్మడి జిల్లాలో త్వరలో పర్యటించే అవకాశం ఉంది. ఆ పర్యటనకు సంబంధించి కూడా నేతలతో చర్చించనున్నారు.

కారు బీభత్సం

పెళ్లి ఊరేగింపులో అదుపుతప్పిన వాహనం

- డివైడర్‌పైకిఎక్కి రోడ్డు పక్కనున్న మహిళను ఢీకొట్టిన వైనం
- అక్కడికక్కడే మృత్యువాత పడిన వివాహిత
- మరో యువకుడికి తీవ్ర గాయాలు
- మూడు ద్విచక్ర వాహనాలు, తోపుడు బండి ధ్వంసం
- డ్రైవర్ మద్యం మత్తులో ఉండడమే కారణం?

సీతమ్మధార, ఫిబ్రవరి 17:

భాజా భజంత్రీలు. కేరింతలు కొడుతూ నృత్యం చేస్తున్న యువత...పెళ్లి ఊరేగింపులో ఉత్సాహభరిత వాతావరణం...ఆ వెనుకే నెమ్మదిగా వస్తున్న కారు...ఒక్కసారిగా పరుగు తీసింది. అతివేగంతో దూసుకుపోయి రాంగ్ రూట్‌లో వెళ్లి డివైడర్‌ను ఢీకొట్టింది. రోడ్డు పక్కన ఉన్న తోపుడుబండిని ఈడ్చుకుంటూ పోయి సమీపంలోని ఇంటి గోడను ఢీకొట్టి అక్కడ పనిచేస్తున్న మహిళ మీదుగా దూసుకుపోయింది. పార్క్ చేసిన ఉన్న ద్విచక్ర వాహనం పైనుంచి వెళ్లి మరో రెండు బైక్‌లపై బోల్తా పడింది. ఈ దారుణ ఘటనలో మహిళ మృత్యువాతపడగా...ఓ యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. హఠాత్పరిణామంతో హతాశులైన పెళ్లి బృందం హాహాకారాలు చేస్తూ రహదారిపై పరుగులు పెట్టింది. ఈ సంఘటన నక్కవానిపాలెంలో శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.



నక్కవానిపాలెంలో డివైడర్‌పైకి దూసుకెళ్లి బోల్తాపడిన కారు



మృతురాలు జగదీశ్వరి (ఫైల్ ఫొటో)

నగరంలోని సీతమ్మధార సమీప కేఆర్‌ఎం కాలనీలోని ఓ ఇంట్లో వివాహం సందర్భంగా వధూవరుల స్నానానికి నీరు తెచ్చేందుకు పెళ్లివారంతా ఊరేగింపుగా వెళుతున్నారు. కొంతమందిని ఎక్కించుకుని వెనుక ఏపీ 21ఇడి 8811 నంబరు గల కారు అనుసరిస్తోంది. దానిని పెదవాల్తేరుకు చెందిన అలజంగి గణేష్ నడుపుతున్నాడు. ఊరేగింపు ఉత్సాహభరిత వాతావరణంలో సాగుతుండగా నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డు కూడలి వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా కారు అతివేగంతో దూసుకుపోయింది. రాంగ్‌రూట్‌లోకి ప్రవేశించి డివైడర్ పక్కనే గల తోపుడుబండిని ఢీకొట్టింది. దానిని ఈడ్చుకుంటూ పోయి డివైడర్‌పైకి ఎక్కి, సమీప ఇంటి వద్ద పనిచేసుకుంటున్న జగదీశ్వరి అలియాస్ జగదీ (42)ని ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. అంతటితో ఆగకుండా ఇంటి గోడను ఢీకొని, కొద్దిదూరం దూసుకుపోయి చిన్నారిని ఎత్తుకొని ఉన్న కె.లక్ష్మణ్‌ను అనే యువకుడిని ఢీకొట్టింది. అతను వెంటనే తన చేతిలోని పాపను పక్కకు విసిరేశాడు. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. పాప స్వల్ప గాయాలతో బయటపడింది. బీభత్సం సృష్టించిన కారు ఓం ఎంటర్‌ప్రైజస్ దుకాణం వద్ద డివైడర్‌ను ఢీకొట్టి, దాని ముందున్న రెండు ద్విచక్ర వాహనాలపై తిరగబడింది. దీంతో అవి నుజ్జునుజ్జయ్యాయి. అక్కడే ఉన్న మరో వాహనం కూడా దెబ్బతింది. ఒక్కసారిగా జరిగిన ఘటనతో అక్కడివారు హతాశులయ్యారు. కారులో ఉన్నవారు కూడా చనిపోయి ఉంటారని భావించారు. కారు అద్దాలు పగలగొట్టి లోపలివారిని బయటకు తీశారు. అందులోని వారెవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఘటన తరువాత కారు డ్రైవర్ మత్తుగా డివైడర్‌పై కూర్చుండిపోయాడు. ప్రమాదంలో మూడు ద్విచక్రవాహనాలు నుజ్జవగా, మరో వాహనం పాక్షికంగా దెబ్బతింది. ప్రమాద సమాచారం తెలుసుకుని కారు యజమాని సంఘటన స్థలానికి ... మిగతా 6వ పేజీలో

తహసీల్దార్ రమణయ్య బంధువు రాజేంద్ర మృతి

- గుండెపోటు వల్లే మృతిచెందారని కుటుంబసభ్యుల వెల్లడి



ప్రధాన రాజేంద్ర (ఫైల్ ఫొటో

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల రెండో తేదీన హత్యకు గురైన తహసీల్దార్ సనపల రమణయ్యకు బంధువుగా చెప్పుకున్న ప్రధాన రాజేంద్ర (47) శుక్రవారం రాత్రి మృతిచెందారు. ప్రసాద్ అనే వ్యక్తి తనకు ఫోన్ చేసి చీపురుపల్లిలోని తమ భూమిలో అడుగుపెట్టొద్దని, అడుగు పెట్టినట్టయితే చంపేస్తానని బెదిరించారంటూ తహసీల్దార్ హత్య జరిగిన మరుసటిరోజు రాజేంద్ర మీడియాకు వెల్లడించిన విషయం తెలిసిందే. తనను బెదిరించిన ప్రసాదే తనకు వరుసకు సోదరుడయ్యే తహసీల్దార్ రమణయ్యను హత్య చేసి ఉంటాడని రాజేంద్ర అనుమానం వ్యక్తంచేశారు. అయితే రమణయ్యను హత్య చేసింది మురారి సుబ్రహ్మణ్యం గంగారావు అని పోలీసుల దర్యాప్తులో తేలింది. అతడిని అరెస్టు చేసి జైలుకు ... మిగతా 6వ పేజీలో

కేన్సర్ నిరోధక ఉచిత వ్యాక్సిన్



వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ షరీన్ రహమాన్

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 17: గర్భకోశ ముఖద్వార కేన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలని చైతన్య స్రవంతి సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షరీన్ రహమాన్ పేర్కొన్నారు. శనివారం ఏవీఎస్‌కాలేజీ వద్ద కమ్యూనిటీ హాల్‌లో 9 నుంచి 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా సెర్వైకల్ క్యాడ్రీ వ్యాలెంట్ వ్యాక్సిన్‌ను వేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భకోశ ముఖద్వార ముఖద్వారా కేన్సర్ నియంత్రణకు వ్యాక్సిన్ ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఉచితంగా వ్యాక్సిన్లు అందిస్తున్నామన్నారు. తొలి విడత 50 మంది బాలికలకు వేసినట్టు తెలిపారు ఒక డోస్ వ్యాక్సిన్‌కు బయట రెండు వేల వరకు ఖర్చవుతుందన్నారు. రెండో డోస్‌ను ఆరు నెలల తర్వాత అందిస్తామన్నారు. కేజీహెచ్ అంకాలజీ విభాగధిపతి డాక్టర్ పాండురంగకుమారి మాట్లాడుతూ ఈవ్యాక్సిన్ 80 శాతం మందికి రక్షణగా నిలుస్తుందన్నారు. వివాహం తర్వాత కూడ వ్యాక్సిన్ డోస్‌లు వేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వ్యాక్సిన్ సరఫరా సంస్థ ఏరియా మేనేజర్ రాంప్రసాద్, చైతన్య స్రవంతి ప్రతినిధులు రకియాభాయి, విజయ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న అధ్యక్షుడు చంద్రమౌళి

మురళీనగర్, ఫిబ్రవరి 17 ; మురళీనగర్ వాకర్స్ క్లబ్ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి తెలిపారు.. శనివారం క్లబ్ వేదిక వద్ద కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిపిన సభ్యత్వ నమోదు ద్వారా రూ. 50 వేలు సమకూరినట్లు తెలిపారు. ఈనెల 21న ప్రపంచ మాతృభాషా దినోత్సవం నిర్వహణ, మార్చి 8న మహిళా దినోత్సవం, వైద్య శిబిరాలు తదితర సామాజిక కార్యక్రమాల్ని చేపట్టనున్నట్లు సభ్యులకు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి వాకర్ కూర్మారావు, సెక్రటరీ పి.చెల్వరాజు, పూర్వ అధ్యక్షులు, ప్రత్యేక ఆహ్వానితులు మాట్లాడారు. వాకర్స్ క్లబ్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

యూసీసీ టి-20 క్రికెట్ పోటీలు



సాత్విక్‌కు అవార్డు అందిస్తున్న రమాకాంత్

విశాఖపట్నం (స్పోర్ట్స్), ఫిబ్రవరి 17: వాల్తేరు రైల్వే స్టేడియంలో జరుగుతున్న యూసీసీ టీ 20 క్రికెట్ చాంపియన్‌షిప్ టోర్నీలో కవలియర్స్ సీసీ, గెలాక్సీ సీసీ జట్లు ఫైనల్స్‌కు చేరాయి. శనివారం జరిగిన తొలి సెమీస్‌లో కవలియర్స్ సీసీ ఏడు వికెట్ల తేడాతో మెట్రో సీసీపై విజయం సాధించింది.ఆల్‌రౌండర్ వరుణ్ సాత్విక్‌కు ప్లెయిర్ ఆఫ్ మ్యాచ్ అవార్డును యూసీసీ ప్రతినిధి రమాకాంత్ అందించారు.

లోకేశ్ శంఖారావానికి సర్వం సిద్ధం

- ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సభ
- విజయవంతం చేయాలి: టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ

మహారాణిపేట, ఫిబ్రవరి 17: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం నిర్వహించనున్న నిర్వహించనున్న శంఖారావం సభను విజయవంతం చేయాలని సౌత్ ఇన్‌చార్జీ గండి బాబ్జీ కోరారు . శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, లోకేశ్ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు మున్సిపల్ స్టేడియంలో సభ ప్రారంభం కానుందన్నారు.నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విచ్చేసి సభను విజయవంతం చేయాలని కోరారు. లోకేశ్ యువగళం పాదయాత్రలో వెళ్లని నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారన్నారు. లోకేశ్ సభలకు జనంనుంచి విశేష స్పందన వస్తుందని తెలిపారు. అలాగే, యాత్ర సినిమాకు ఆదరణ కరువైందని.. రాజధాని సినిమాపై ప్రేక్షకులు విశేష ఆదరణ చూపుతున్నారు. ఈ సినిమాలో జగన్ మోసాలను తెలుసుకుంటున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జగన్ గద్దెదిగడం ఖాయమని అన్నారు. అలాగే, ఇందిరా గాంధీ స్టేడియంలో ఆదివారం మధ్యాహ్నం యువనేత నారా లోకేశ్ నిర్వహించనున్న శంఖారావం సభ ఏర్పాట్లను శనివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ నజీర్‌తోపాటు నాయకులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. దక్షిణ నియోజకవర్గ ప్రజలు వచ్చి సభ విజయవంతం చేయాలని కోరారు.



స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న గండి బాబ్జీ, నాయకులు

సభను ప్రజలు పెద్ద సంఖ్యలో రావాలి

డాబాగార్డెన్స్: నారా లోకేశ్ శంఖారావం కార్యక్రమానికి 31వ వార్డు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి వానపల్లి గాయత్రిఫణికుమారి పిలుపునిచ్చారు.శనివారం వార్డు కార్యాలయంలో ఇన్‌చార్జి గండిబాబ్జీ ఆదేశాల మేరకు సమావేశమయ్యారు. ఆదివారం 12.30 గంటలకు ప్రారంభంకానున్న ఈ సభకు ప్రజలను అధిక సంఖ్యలో తరలించాలని కోరారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి రావడమే ధ్యేయంగా ప్రతీ ఒక్కరూ పనిచేయాలని కోరారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు సారిపల్లి మహేష్, నాని, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యం కల్పించే పార్టీకే మద్దతు

- ఉత్తరాంధ్ర తూర్పు కాపు సంఘం అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు



సంఘీ భావం తెలుపుతున్న నాయకులు

మహారాణిపేట, ఫిబ్రవరి 17: ఉత్తరాంధ్ర జిల్లాలో అత్యధికంగా ఉన్న తూర్పు కాపులకు తగిన స్థాయిలో అసెంబ్లీ, పార్లమెంట్ టికెట్లు కేటాయించాలని ఉత్తరాంధ్ర తూర్పు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసనాయుడు వివిధ పార్టీలను డిమాండ్ చేశారు. శనివారం జడ్పీ జంక్షన్ వద్ద ఓ సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపుల పేరుతో తూర్పు కాపులకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. ఉత్తరాంధ్రలో తూర్పు కాపులు 30 లక్షల మందికి పైగా ఉన్నారన్నారు. జనాభా దామాషా ప్రకారం ఉమ్మడి శ్రీకాకుళం విజయనగరం, విశాఖ జిల్లాలో అధిక టికెట్లు కేటాయించాలన్నారు. కానున్న రోజులలో వలస నాయకులు వద్దు-స్థానిక నాయకులు ముద్దు అనే నినాదంతో ముందుకు వెళ్తామన్నారు. తూర్పు కాపులకు సీట్లు ఇచ్చే పార్టీలకు అండగా ఉంటామన్నారు. ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర గౌరవ అధ్యక్షుడు లంకా మోహనరావు , బి సుధాకర్, గణేష్, రెడ్డి వెంకటరమణ, కల్యాణ గోపి, అనిరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేద వర్గాల సేవే రోటరీ క్లబ్ లక్ష్యం

- రోటరీ గవర్నర్ దత్త సుబ్బారావు



సేవలను వివరిస్తున్న రోటరీ గవర్నర్ దత్తా సుబ్బారావు

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 17: పేద వర్గాల సేవే లక్ష్యంగా రోటరీ క్లబ్ పనిచేస్తోందని రోటరీ గవర్నర్ దత్త సుబ్బారావు తెలిపారు. శనివారం నగరం విశాఖ పోర్టు సిటీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రోటరీ ద్వారా పోలియో 99.9 శాతం నిర్మూలించినట్టు చెప్పారు. విశాఖ పోర్టు సిటీ పోలియో నిర్మూలనకు రూ. 2 లక్షలు, రోటరీ ఫౌండేషన్ కోసం మరో రూ. 3.50 లక్షల విరాళం అందించడంపై ఆయన అభినందనలు తెలిపారు. రోటరీ విశాఖ పోర్టుసిటీ నగరంలోని ప్రభుత్వ బాలిక హాస్టల్స్, జువైనల్ హోమ్స్‌లకు ఉచితంగా పరుపులు అందించినట్టు చెప్పారు. కుట్టుమిషన్లు, బాలికల అంధుల పాఠశాలకు ఫర్నీచర్ చేకూర్చామని, బాలికలకు స్కాలర్ షిప్‌లనందిస్తున్నట్టు పేర్కొన్నారు. పెదవాల్తేరు కంటి ఆసుపత్రి వద్ద రోటరీ డయాగ్నస్టిక్ సెంటర్ ద్వారా తక్కువ ధరకు ఆరోగ్య పరీక్షలందిస్తున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో రోటరీ జిల్లా గవర్నర్ జి.విశ్వనాథ్, పూర్వఅధ్యక్షుడు జీఎస్‌రాజు, కార్యదర్శి ఎన్ఎస్ఎన్ రాజు, కోశాధికారి కె.వి.రమణ, రోటేరియన్లు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయమైన కోర్కెలను వెంటనే పరిష్కరించాలి

- ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ ఈశ్వరరావు



నల్లబాడ్జీలు ధరించి ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

మహారాణిపేట, ఫిబ్రవరి 17: ఉద్యోగుల బకాయిలను చెల్లించడంతో న్యాయమైన కోర్కెలను వెంటనే పరిష్కరించాలని అమరావతి జేఏసీ విశాఖ జిల్లా చైర్మన్ కె. ఈశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ ఉద్యమ కార్యచరణలో భాగంగా శనివారం కలెక్టరేట్ జంక్షన్‌లోని ఎన్‌జీవో భవన్‌లో ఆవరణలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లుగా ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రివర్స్ పీఆర్సీ, సంవత్సరాల తరబడి సరండర్‌లీవ్‌లు ఎగవేస్తోందన్నారు. దాచుకున్న డబ్బు కూడా ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కోరారు ఈ సమావేశంలో ఉద్యోగ నాయకులు రొంగలి రవిశంకర్ కె శ్రీనివాసరావు, డీడీ ప్రసాదరావు , దాసరి నాగేశ్వరరావు, దశరధరామి రెడ్డి, ఎస్ సత్తిబాబు, ఎస్ చంద్ర శేఖర్, పి.అప్పలరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అయోధ్య పాదుకలతో రథయాత్ర



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సీతంపేట, ఫిబ్రవరి 17: రామ నామంతో సీతంపేటవీధులు మార్మోగాయి. రాధాకృష్ణ మందిరం నుంచి ప్రధాన కూడలిలోని దుర్గాగణపతి ఆలయం వరకు అయోధ్యరాముని పాదుకలను రథంపై ఊరేగించారు. వార్డు కార్పొరేటర్ మాజీ జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు సారిపిల్లి గోవింద్ ఆర్థిక సహాయంతో ఈ యాత్రను సీతంపేట షిరిడీ సాయిబాబా భజన మండల్, సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ యాత్రను కార్పొరేటర్ గోవింద్ జెండా ఊపి ప్రారంభించారు. భక్తులు సారిపిల్లి గంగరాజు, బోర వెంకట రమణ, నమ్మి వెంకట్, సన్నీ, గుడివాడ గౌరీ నాయుడు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై అవగాహన

మహారాణిపేట, ఫిబ్రవరి 17: విదేశాలలో విద్యను అభ్యసించాలనుకునే వారికి నిపుణులతో అవగాహన శిక్షణ అందించనున్నట్లు యూనీ సంస్థ మేనేజర్ కె. అనిత తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మా ట్లాడారు. ఈ నెల 19వ తేదీన ఆస్ట్రేలియా అడిషన్సు డే నిర్వహిస్తున్నామన్నారు. పదికి పైగా ఆస్ట్రేలియా యూనివర్సిటీలు ఆరోజు పాల్గొంటున్నాయన్నారు. విద్యార్థుల అర్హత ప్రకారం అవకాశాలు లభిస్తాయన్నారు.

ఆర్థిక రాజధానిగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నాడని దుయ్యబట్టారు. తాము విశాఖను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేయడంతోపాటు ఫ్లై ఓవర్లు, అండర్ బ్రిడ్జిలు నిర్మించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. మెడికల్ డివైస్ తయారీ హబ్‌గా, ఐటీ కేంద్రంగా విశాఖను తీర్చిదిద్దుతామని లోకేష్ స్పష్టంచేశారు. ఏటా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని, ఉద్యోగం వచ్చేంత వరకు మూడు వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామని నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. భీమిలి నియోజకవర్గంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, 2019 ఎన్నికల్లో తనను ఇక్కడి నుంచి పోటీ చేయాల్సిందిగా చంద్రబాబు చెప్పారన్నారు. కానీ, ఇప్పటివరకు టీడీపీ గెలవని స్థానాన్ని కోరి మరీ మంగళగిరి నుంచి తాను పోటీ చేశానని, స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యానన్నారు. భీమిలి నుంచి పోటీ చేస్తే తనతోపాటు భరత్ కూడా నెగ్గేవాడని, ఆ మాట ఇప్పటికీ భరత్ చెబుతుంటాడన్నారు. భవిష్యత్తులో కూడా భీమిలిని అభివృద్ధి చేసే బాధ్యతను తాము తీసుకుంటామని స్పష్టం చేశారు.

2014 నుంచి 2019 వరకు ఇక్కడ వేయి కోట్ల అభివృద్ధి పనులు చేశామని, ఇండోర్ స్టేడియం, మిలీనియం టవర్ ఏర్పాటుచేయడంతోపాటు టిడ్కో ఇళ్లను నిర్మించామన్నారు. 2019లో భీమిలి నియోజకవర్గ ప్రజలు పాలిచ్చే ఆవును కాదని, తన్నే దున్నపోతును గెలిపించుకున్నారన్నారు. అర గంట అవంతి మంత్రిగా పనిచేసినా ఇక్కడి అభివృద్ధి పనులు చేయలేదని, ప్రజల జీవితాల్లో మార్పులు రాలేదన్నారు. ఆయనకు రాసలీలలు మాత్రమే తెలుసునని ఎద్దేవా చేశారు. ఆయన వ్యవహారాన్ని చూడలేక ఇక్కడి ప్రజలు తలదించుకునే పరిస్థితి దాపురించిందన్నారు. వైసీపీ నాయకులు అవినీతికి కేరాఫ్‌గా భీమిలిని మార్చారని, రాష్ట్రంలోని నాయకులంతా ఇక్కడి భూములపై పడ్డారని ఆరోపించారు. ఈ ప్రాంతానికి చెందిన రూ.2500 కోట్ల విలువైన భూములను వైకాపా నాయకులు దోచుకున్నారన్నారు. అరగంట అవంతి అవినీతి పెరిగిపోయిందని, అనేక పోస్టులు అమ్ముకున్నాడని, జూట్ ఫ్యాక్టరీ నుంచి డబ్బులు తీసుకుని కార్మికులకు న్యాయం చేయలేదని ఆరోపించారు. తనకు అక్కా, చెల్లెళ్లు, అన్నదమ్ములు లేరని, 60 లక్షల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలే తనకు అక్క, చెల్లెళ్లు, అన్నదమ్ములన్నారు. టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మూడుచోట్ల లోకేశ్ సభలు

ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తూర్పు నియోజకవర్గ పరిధిలోని అప్పుఘర్ వద్ద గల గాదిరాజు ప్యాలెస్ సమీపాన, రెండు గంటలకు విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఏర్పాటుచేసే సభల్లో లోకేశ్ పాల్గొంటారు. అక్కడ నుంచి సాయంత్రం ఐదు గంటలకు విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని గోపాలపట్నం పెట్రోల్ బంకు సమీపాన వెంకటాపురంలో నిర్వహించనున్న సభలో పాల్గొంటారు. ఆదివారం రాత్రి విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని బిర్లా జంక్షన్ సమీపాన గల హోండా షోరూమ్ వద్ద బస చేస్తారు.

ఉత్తరాంధ్రకు పట్టిన దరిద్రం జగన్

... 5వ పేజీ తరువాయి

తీసుకువస్తే జగన్ బూమ్‌బూమ్, ప్రెసిడెంట్ మెడల్ వంటి మద్యం బ్రాండ్లు తీసుకువచ్చారన్నారు.

నవ మోసాలు: ఎన్నికల ముందు నవరత్నాలు అని ఊదరగొట్టిన జగన్, అధికారంలోకి వచ్చిన తరువాత దానిని నవ మోసాలుగా చేశారని లోకేశ్ ధ్వజమెత్తారు. మద్య నిషేధం చేసిన తరువాతే ఓట్లు అడుగుతానని ప్రజలను నమ్మించిన వ్యక్తి... మాట తప్పడమే కాకుండా నేడు వీధివీధినా మద్యం అమ్ముతున్నారన్నారు. ప్రజల కష్టాలు చూసి చంద్రబాబు సూపర్ సిక్స్ ప్రకటించారని గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేస్తామని ప్రకటించారు. బూత్ స్థాయి అధ్యక్షులు, ముఖ్యమైన నాయకులు రానున్న రెండు నెలల్లో ప్రజల్లోకి వెళ్లి సూపర్ సిక్స్ కోసం ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. సభలో పెందుర్తి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బండారు సత్యనారాయణమూర్తి, జనసేన రూరల్ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడారు. అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి కేడర్‌కు లోకేశ్ సూపర్ సిక్స్ కిట్లు పంపిణీ చేశారు.

తహసీల్దార్ రమణయ్య బంధువు రాజేంద్ర మృతి

... 5వ పేజీ తరువాయి

తరలించారు. ఇదిలావుండగా తహసీల్దార్ బంధువుగా చెప్పుకుంటున్న ప్రధాన రాజేంద్ర శుక్రవారం మృతిచెందడం చర్చనీయాంశంగా మారింది. పోలీసులు, ప్రసాద్, తదితరుల ఒత్తిళ్లను తట్టుకోలేకే రాజేంద్ర మృతిచెందాడంటూ ప్రచారంజరిగింది. అయితే రాజేంద్ర భార్య త్రివేణి మాత్రం తన భర్తకు గుండెపోటు రావడం వల్లే మృతిచెందారని, ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదని స్పష్టంచేశారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కోటపాటు కొత్తూరుకు చెందిన ప్రధాన రాజేంద్ర పదేళ్ల కిందట విశాఖ వచ్చి ఎంవీపీకాలనీలోని గాదిరాజు ఎంపైర్స్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. భార్య త్రివేణితోపాటు ఏడేళ్ల కుమార్తె ఉంది. రాజేంద్ర కొంతకాలం కిందటి వరకూ అనకాపల్లిలో మహీంద్ర ట్రాక్టర్ల షోరూమ్ నిర్వహించేవారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కొనసాగుతున్నారు. కాగా త్రివేణి కథనం ప్రకారం...మధుమేహం కలిగి ఉన్న రాజేంద్ర శుక్రవారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఒక్కసారిగా షుగర్ లెవెల్స్ పెరిగిపోవడంతో కుప్పకూలిపోయారు. వెంటనే షీలానగర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించామని, అక్కడ చికిత్స పొందుతూ రాత్రి పది గంటల సమయంలో మృతిచెందారు. కార్డియాక్ అరెస్టు వల్లే రాజేంద్ర మృతిచెందినట్టు వైద్యులు కూడా నిర్ధారించారన్నారు. తన భర్త అంత్యక్రియలు కూడా పూర్తయినందున ఆ విషయాన్ని అక్కడితో వదిలేయాలని ఆమె కోరారు. తన భర్త మృతి చెందడంతో ఏడేళ్ల కుమార్తెతో ఎలా బతకాలో తెలియని స్థితిలో ఉన్న తమను కొన్ని టీవీ ఛానల్స్ తప్పుడు వార్తలు ప్రసారం చేసి మనోవేదనకు గురిచేస్తున్నారని వాపోయారు. ఏదైనా లేనిపోని అనుమానాలతో కథనాలు ప్రసారం చేస్తే ఆయా మీడియా సంస్థల పేరు చెప్పి తన కుమార్తెతో కలిసి ఆత్మహత్య చేసుకోవడం ఒక్కటే తనకు మార్గమని త్రివేణి ఆవేదన వెళ్లగక్కారు.

కారు బీభత్సం

... 5వ పేజీ తరువాయి

వచ్చి డ్రైవర్‌ను తనతో తీసుకువెళ్లేందుకు యత్నించాడు. పోలీసులు అడ్డుకోవడంతో వారితో వాగ్వాదానికి దిగాడు.

మద్యం మత్తులోనే...?

కారు డ్రైవర్ అలజంగి గణేష్ మత్తుగా ఉండడంతో పాటు ఏమి జరిగిందో తెలియని స్థితిలో ఉండడాన్ని స్థానికులు గమనించారు. అతడు మద్యం సేవించి ఉన్నాడని చెబుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత అతడిని స్థానికులు విచారించగా తనది పెదవాల్తేరని, పెళ్లిలో కారు నడిపేందుకు ఆఫ్టింగ్ డ్రైవర్‌గా వచ్చానని తెలిపాడు. రాత్రంతా మద్యం సేవించానని వివరించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ ఎస్ఐలు బి.తిరుపతిరావు, వి.కనకారావు, ఏఎస్ఐ ప్రసాద్ వివరాలను సేకరించారు. గాయపడిన లక్ష్మణ్, డ్రైవర్ గణేష్‌లను ఆస్పత్రికి తరలించారు. జగదీశ్వరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురికి తరలించారు.

తల్లడిల్లిన తనయుడు

నక్కవానిపాలెం రామాలయం వీధికి చెందిన జగదీశ్వరి అలియాస్ జగదీ కూలీ. ఆమె భర్త పదేళ్ల కిందటే అనారోగ్యంతో మృతి చెందాడు. కుమారుడు పోలిశెట్టి గణేష్‌తో కలిసి జీవిస్తోంది. తన రెక్కల కష్టంతో అతడిని ఇంటర్ చదివిస్తోంది. ప్రమాదంలో తల్లి మృత్యువాత పడడంతో కుమారుడు గణేష్ భోరున విలపిస్తున్నాడు. ఉన్న ఒక్కగానొక్క ఆధారం తిరిగిరాని లోకాలకు తరలిపోయిందని, ఈ లోకంలో తనకంటూ ఇంకెవరూ లేరని, ఎలా బతకాలని, ఎవరు చదివిస్తారని వెక్కివెక్కి ఏడుస్తున్న అతడిని ఓదార్చడం ఎవరితరం కావడం లేదు.

డ్రైవర్‌కు ఫిట్స్?

ఆఫ్టింగ్ డ్రైవర్‌గా వచ్చిన గణేష్‌కు కారు నడుపుతుండగా ఫిట్స్ రావడంతోనే ప్రమాదం జరిగిందని కారు యజమాని చెబుతున్నాడు. అయితే కేసు తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిట్స్ వస్తే కారును అంతదూరం ఎలా నడిపాడని, ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్‌ను కారులోనుంచి తామే బయటకు తీశామని, అప్పుడు మామూలుగానే ఉన్నాడంటున్నారు. ఫిట్స్ వస్తే నోటిలో నురగలు కూడా వస్తాయని, కేసు నుంచి తప్పించేందుకే యజమానితప్పుడు సమాచారం ఇస్తున్నాడని చెబుతున్నారు.

'అవినీతి రహిత పాలనే ధ్యేయం'

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 17: అవినీతి రహిత పాలనే ధ్యేయంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆల్ తెలుగు ప్రజా పార్టీ ఏర్పాటుచేసినట్టు ఆల్ తెలుగు ప్రజా పార్టీ విశాఖ పార్లమెంట్ పరిశీలకురాలు ఎన్.సంధ్యా అన్నారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏటీపీపీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రినిచేయడమే ధ్యేయమన్నారు. ఇప్పటివరకు ఉన్నపార్టీలు అవినీతిని ప్రోత్సహిస్తూ ప్రజా సంక్షేమాన్ని గాలికివదిలేసి కుటుంబ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ స్థితిలో తమతో కలిసి వచ్చే పార్టీలను కలుపుకొని ముందుకు వెళ్తామన్నారు. నేతలు సాయేశ్వరరావు,గంటిమోహనరావు పాల్గొన్నారు.

'విశ్వబ్రాహ్మణులకు 'దక్షిణ' టికెట్ ఇవ్వాలి'



మాట్లాడుతున్న విశ్వబ్రాహ్మణ సంఘాల నేత అప్పలాచారి

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 17: దక్షిణ నియోజకవర్గంలో అత్యధిక శాతం ఉన్న విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గానికి ప్రధాన రాజకీయ పార్టీలు ప్రాధాన్యత కల్పించి వచ్చే ఎన్నికల్లో టికెట్లు కేటాయించాలని విశ్వబ్రాహ్మణ మహాసేన (బీసీ) ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ నేత తాళాబత్తుల అప్పలాచారి మాట్లాడారు. ఇప్పటి వరకు విశ్వబ్రాహ్మణులకు ఏ పార్టీ సరైన గుర్తింపు ఇవ్వలేదని విచారం వ్యక్తం చేశారు. విశ్వబ్రాహ్మణుల జనాభా ఆంధ్రప్రదేశ్‌లో 24 లక్షల మంది ఉన్నారన్నారు. కాశీ సన్యాసిరాజు, కె. సూర్య, ఎ.శ్రీనివాస్ మాట్లాడారు. శివకోటి వాసు, గోడి నరసింహాచారి, విశ్వబ్రాహ్మణ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళాబత్తుల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బోదలపాటి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కెమికల్ విద్యార్థులకు పురస్కారాలు



పురస్కార గ్రహీతలతో ప్రిన్సిపాల్ రమణ, పూర్వవిద్యార్థులు

కంచరపాలెం, ఫిబ్రవరి 17: స్థానిక ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగేళ్లలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు శనివారం ప్రతిభా పురస్కారాల ప్రదానం చేశారు. తొలుత బ్యాచ్ (1971-75) నుంచి నేటి వరకు కళాశాల కళాశాలలో చదువుకుని ఉన్నతస్థాయిలో ఉన్న పూర్వవిద్యార్థులు ముందుగా ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు కళాశాలతో తమ అనుబంధాన్నినెమరువేసుకున్నారు. కళాశాలకు తాము అందిస్తున్న సహకారాన్ని వివరించారు. కెమ్‌దోసా అధ్యక్షుడు ఎ.వరహాలు, కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డా.బి.దేముడు పాల్గొని వారి అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం మెరిట్ విద్యార్థులకు రూ.90 వేలు నగదు పోత్సాహకంగా అందించారు. ప్రస్తుతం చదువుతున్న వారిలో ప్రేరణ కల్పించారు.

'టీడీపీ ఉత్తర కన్వీనర్‌గా 'పాలమరశెట్టి'ను నియమించాలి'

మద్దిపాలెం, ఫిబ్రవరి 17: ఉత్తర నియోజకవర్గ టీడీపీ కన్వీనర్‌గా పార్టీ నాయకుడు, విశాఖ పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి పాల మరశెట్టి శ్రీనివాసరావును నియమించాలని కోరుతూ ఉత్తర నియోజకవర్గంలో పలు వార్డుల అధ్యక్షులు, కార్యదర్శులు తీర్మానం చేశారు. ఈమేరకు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, శ్రీనివాసరావు ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా పార్టీ కోసం అహర్నిశలు పని చేస్తున్నారన్నారు. ఆయన సేవలను గుర్తించి ఉత్తర నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్తగా పార్టీ అధిష్ఠానం సముచితస్థానం కల్పించాలని వారు కోరారు.

ఈతలపాక సుజాత వినతి

అక్కయ్యపాలెం: ఉత్తర నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా తనను నియమించాలని తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ తనను నియమిస్తే పార్టీని బలోపేతం చేసి మరింత ముందుకు తీసుకెళ్తానని చెప్పారు. కార్యకర్తలు, నాయకుల సమన్వయంతో ఎన్నికల్లో టీడీపీ విజయానికి తనవంతు శ్రమిస్తానన్నారు.

మిలాన్ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ

- 21, 22 తేదీల్లో వాహనాల మళ్లింపు
- కొన్ని మార్గాల్లో రాకపోకలపై నిషేధం

మహారాణిపేట, ఫిబ్రవరి 17: విశాఖలోని ప్రతిష్ఠాత్మకమైన మిలాన్- 2024 నిర్వహిస్తున్న సందర్భంగా ఈ నెల 21, 22 తేదీల్లో నగరంలో ట్రాఫిక్ నియంత్రిస్తున్నారు. శనివారం పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీపీ వి.ఎస్. మణికంఠ అందించిన వివరాలివి.. ఈ నెల 21, 22 తేదీల్లో ఉపరాష్ట్రపతి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రులు మిలాన్ నేపథ్యంలో నగరానికి రానున్నారు. అందువల్ల భారీ వాహనాల రాకపోకలు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ , షీలానగర్ నుంచి కాన్వెంట్ జంక్షన్ , కాన్వెంట్ జంక్షన్ నుండి సింధియా వైపు రహదారులపై రాకపోకలను నిషేధించనున్నారు. ఈ సమయంలో తమ వాహనాలను పార్కింగ్ ప్రదేశాలు, తమ యార్డులలో మాత్రమే నిలపాల్సి ఉంటుంది. ఐఎన్ఎస్ శాతవాహన, కృష్ణ, కాకతీయ గేట్ల వద్ద డాక్‌యార్డు ఉద్యోగుల తమ వాహనాలను పార్కింగ్ చేయడానికి వీలులేదు.

బీచ్ రోడ్డులో....

ఈ నెల 20, 22 తేదీలలో నగరంలోని రామకృష్ణా బీచ్ రోడ్డు నుంచి నేవల్ కోస్టల్ బ్యాటరీ వరకు మధ్యాహ్నం ఒంటి నుంచి రాత్రి 8 గంటల వరకు వాహనాల రాకపోకలు నిషేధించారు. పాస్‌లు కలిగిన వాహనదారులు, సమీపంలో నివసిస్తున్న వారు పోలీసుల సూచనలు పాటించాల్సి ఉంది. పాస్‌లు కలిగిన వాహనదారులు ఏపీఐఐసీ గ్రౌండ్‌లో పార్కింగ్ చేయాలి. పాస్‌లులేనివారు తమ వాహనాలను ఎంజీఎం పార్కులోని ఆంధ్రా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో పార్కింగ్ చేసి, కాలినడకన బీచ్‌లోకి చేరుకోవాల్సి ఉంటుంది.

ఆక్రమిత స్థలాల్లో హెచ్చరిక బోర్డు

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 : జీవీఎంసీ 8వ వార్డులోని ఎండాడ హయగ్రీవ ప్రాజెక్ట్ కొండ దిగువన ప్లాట్లుగా చేసి పునాదులు వేసిన ఆక్రమణలను సచివాలయ సిబ్బంది శనివారం తొలగించారు. 'జాగా కనిపిస్తే పాగా' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల వచ్చిన కథనం మేరకు సచివాలయం సిబ్బంది ఈ చర్యలు చేపట్టారు. కొండపై వేసిన పునాదులను తొలగించి, అక్కడ హెచ్చరిక బోర్డు పెట్టారు. ఈ ప్రాంతంలో మరికొన్ని ఆక్రమణలు ఉన్నాయని వాటిని కూడా త్వరలో తొలగిస్తామని గ్రేడ్ 1 వీఆర్వో ఇమ్రాన్, టౌన్ ప్లానింగ్ సెక్రటరీ శ్రీనివాస్ తెలిపారు.

నేరాల నియంత్రణపై అవగాహన

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 17 : ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యా పరిషత్ విద్యార్థులకు ఎంవీపీ పోలీసులు నేరాల నియంత్రణపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంవీపీ పోలీస్ స్టేషన్ నేర విభాగం ఎస్ఐ రాందాస్ మాట్లాడుతూ నేరం జరిగే తీరు, నియంత్రణ, శిక్షలు వంటి అంశాలపై వివరించారు. విద్యార్థులు నేరాల్లో ఎలా ఇరుక్కుంటున్నారో తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆరిలోవ, ఫిబ్రవరి 17 : జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో రూ. 20లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు వైసీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యన్నారాయణ శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వార్డు వైసీపీ ఇన్‌చార్జి కెల్ల సత్యన్నారాయణ, వంకర బాబూరావు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై అభివృద్ధి పనులకు భూమి పూజ

సింహాచలం, ఫిబ్రవరి 17 : సింహగిరిపై సుమారు రూ. 20 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆలయ అధికారులు శనివారం భూమి పూజ చేశారు. రూ. 10 లక్షలతో సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయటంతో పాటు మరో రూ. 10 లక్షలతో క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయ సమీపంలో వాహన శాల ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులను దాతల సహకారంతో చేపడుతున్నట్టు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, ఫిబ్రవరి 17 : అప్పన్నకు పలు ఆర్జిత సేవలను శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు.శాస్త్రవిధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృసింహ సహస్రనామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళాలతో అర్చన చేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

పాఠశాలల్లో నో బ్యాగ్ డే

తగరపువలస, ఫిబ్రవరి 17 : తగరపువలసలోని 1, 2 వార్డుల్లో ఉన్న బంగ్లామెట్ట, సంతపేట, రాయిపాలెం, సంగివలస జీవీఎంసీ పాఠశాలల్లో శనివారం నో బ్యాగ్‌డే చేపట్టారు. నెలలో ప్రతి మూడో శనివారం పాఠశాలల్లో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వివిధ రకాల కృత్యాలను విద్యార్థులకు నేర్పించారు. లోకాస్ట్ నో కాస్ట్ విధానంలో చీపురుపుల్లలు, అట్ట ముక్కలు, సుద్ద ముక్కలు వంటి వాటితో చిన్న చిన్న వస్తువులు తయారు చేయించారు.

విద్యుత్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన

ఆనందపురం, ఫిబ్రవరి 17 : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఏఈ సురేష్ కుమార్ విద్యుత్ వినియోగంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ ఎలా సరఫరా అవుతుంది, ఎలా వినియోగిస్తున్నారన్నది వివరించారు.కార్యక్రమంలో లైన్‌మేన్ అనీల్‌రాజ్, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు భీష్మనారాయణ, భాస్కరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ట్రూ లవర్ :** శ్రీకన్య, వెంకటేశ్వర, గోకుల్, , శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక)
- **ఈగల్ :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **లాల్ సలామ్ :** మెలోడి, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **యాత్ర-2 :** సంగం, కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), శ్రీన్య (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** శారద, లక్ష్మీకాంత్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** రమాదేవి, లీలామహల్, లక్ష్మీకాంత్ (గాజువాక)
- నా సామిరంగ : శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20,టమాటా 18, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 50, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 44, బీరకాయలు 46, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 22, క్యాబేజ్ 22, క్యారెట్ 24, దొండకాయలు 40, బంగాళా దుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది) 106, బరబటి 28, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 40, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 55, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 52, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, క్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	115
ఫారం ధర	--	135
విత్ స్కిన్	--	240
స్కిన్‌లెస్	--	250

మరికొన్ని సిటీ వార్తలు పేజీ IIIలో..



సభలో కార్యకర్తల ఆనందం



అప్పుఘర్ వద్ద లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు

సమస్యలు పరిష్కరిస్తాం

- భీమిలి పట్టణాభివృద్ధికి నారా లోకేశ్ హామీ
- ప్రజలకు అండగా ఉంటామని భరోసా

తగరపువలస/భీమునిపట్నం, ఫిబ్రవరి 17 : భీమిలి నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. శనివారం సాయంత్రం చిట్టివలసలో జరిగిన శంఖారావం సభలో ఆయన మాట్లాడారు. భీమిలిలో రైతుబజార్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రధాన రహదారిని విస్తరిస్తామని చెప్పారు. రిజర్వాయర్‌ను అభివృద్ధి చేస్తామని, మత్స్యకారులకు అండగా ఉంటామని, రెండేళ్లలో జెట్టీ నిర్మాణం చేపడతామని తెలిపారు. రాయితీపై మత్స్యకారులకు ఏటా పరికరాలు అందిస్తామన్నారు. పంచ గ్రామాల సమస్యను పరిష్కరిస్తామని, సింహాచలం భూముల్లో దశాబ్దాలుగా నివసిస్తున్న ప్రజలకు పట్టాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటామన్నారు.భీమిలి ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకలుగా అభివృద్ధి చేస్తామని, లారీ డ్రైవర్లను ఆదుకునేలా ట్యాక్స్‌లు తగ్గిస్తామని చెప్పారు.



సభలో మాట్లాడుతున్న లోకేశ్



టీడీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీభరత్ మాట్లాడుతూ విధ్వంసం వైసీపీ ప్రభుత్వం లక్ష్యమని, ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేశారని విమర్శించారు. ఈ సారి ఎన్నికల్లో నగరంలోని ఏడు నియోజకవర్గాల్లో ప్రతిచోట 30 వేలు నుంచి 40 వేలు మెజారిటీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే అవంతి మంత్రిగా చేసినప్పటికీ పట్టణాన్ని కనీసం అభివృద్ధి చేయలేదన్నారు. ఇండోర్ స్టేడియానికి మరమ్మతులు కూడా చేయలేదని విమర్శించారు. చిట్టివలస జూట్‌మిల్లును మూసివేసి ఆ భూములను బినామీ పేర్లతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారన్నారు జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ మాట్లాడుతూ భీమిలి బీచ్‌లో గతంలో ఉన్న భీముడి విగ్రహం లేకుండా చేశారని, అల్లూరి పుట్టిన పాండ్రంకిలో వంతెన నిర్మించలేదన్నారు. అనంతరం పార్టీ శ్రేణులతో విశాఖ పార్లమెంటరీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రమాణం చేయించారు.

అంబేడ్కర్ విగ్రహం బహూకరణ

సింహాచలం : లోకేశ్‌కు తెలుగు యువత నాయకులు బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని బహూకరించారు. భీమిలిలో జరిగిన శంఖారావం సభకు వచ్చిన లోకేశ్‌ను తెలుగుయువత అధ్యక్షుడు రాజు సారథ్యంలో సతివాడ శంకరరావు, ఒమ్మి సత్యం, శ్రీను యాదవ్ కలిసి విగ్రహాన్ని అందజేశారు. కాగా ఆదివారం ఉదయం 7 గంటలకు లోకేశ్ వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకోనున్నట్టు 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం తెలిపారు. ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

లోకేశ్‌కు ఘన స్వాగతం

ఎంవీపీ కాలనీ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు ఎంవీపీ కాలనీలో ఘన స్వాగతం లభించింది. అప్పుఘర్ వద్ద తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పార్టీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆదివారం ఉదయం అప్పుఘర్ వద్ద జరగనున్న శంఖారావం సభలో లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ బాణసంచా కాల్పులతో, సాంస్కృతిక కార్యక్రమాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చోడే పట్టాభిరామ్, ఒమ్మి సన్యాసిరావు, గొలగాని పోలారావు, బొట్ట రమణ, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి చేరికలు

తగరపువలస : శంఖారావం సభలో పలువురు టీడీపీలో చేరారు. పద్మనాభం మాజీ ఎంపీపీ కాళ్ల పద్మ, ఆ మండల వైసీపీ నాయకుడు కాళ్ల నగేష్, మద్ది మాజీ సర్పంచ్ కాళ్ల సత్యవతి, తదితరులు టీడీపీలో చేరారు. వారికి లోకేశ్ కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు.

శంఖారావం సభకు సర్వం సిద్ధం

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీలోని అప్పుఘర్‌లో ఆదివారం జరగనున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం సభకు నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వేదిక పక్కనున్న ప్రదేశంలో లోకేశ్ బస్సులో బస చేయడానికి ఏర్పాట్లు చేశారు.వేదిక మీదకు రావడానికి దారి కూడా ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాలు టీడీపీ, జనసేన జెండాలతో కళకళలాడతున్నాయి.తూర్పు నియోజకవర్గంలోని అన్ని వార్డుల నుంచి ఐదు వేల మంది కార్యకర్తలు సభకు హాజరుకావచ్చని నాయకులు భావిస్తున్నారు.

శంఖారావం సభకు తరలివెళ్లిన టీడీపీ, జనసేన శ్రేణులు

ఎండాడ, ఫిబ్రవరి 17 : చిట్టివలస బంతాట మైదానంలో శనివారం జరిగిన శంఖారావం సభకు 8వ వార్డు నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. తొలుత ఎండాడ నుంచి వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన శ్రేణులు సుమారు 120 బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు వాహనాల్లో సభకు వెళ్లారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చినగోపి, ప్రవీణ్, సారిపిల్లి శ్రీను, ఒమ్మి బాబూరావు, చెట్టుపల్లి సన్యాసిరావు,దొరబాబు, సూరిబాబు, రెడ్డి, మంగాదేవి, ప్రెస్టీజ్ షోరూమ్ రాజు, జనసేన నాయకులు సత్యనారాయణ, అనీల్, తదితరులు పాల్గొన్నారు.



మధురవాడలో బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మంగమ్మ

మధురవాడ : శంఖారావం సభకు ఏడో వార్డు నుంచి టీడీపీ, జనసేన శ్రేణులు తరలివెళ్లాయి. కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు ఆధ్వర్యంలో యువకులు ముందుగా బైక్ ర్యాలీతో తగరపువలస చేరుకున్నారు. ర్యాలీని వుడాకాలనీలో కార్పొరేటర్ మంగమ్మ ప్రారంభించారు.అనంతరం టీడీపీ, జనసేన నాయకులు పలు వాహనాల్లో వెళ్లారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ, జనసేన ఏడో వార్డు అధ్యక్షుడు నాగోతి నరసింహనాయుడు, నక్కా శ్రీధర్, టీడీపీ నాయకులు పోతిన నాయుడు, పోతిన బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభం నుంచి కూడా కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు కె. రమణ ఆధ్వర్యంలో పలు గ్రామాలకు చెందిన కార్యకర్తలు, ప్రజలు వాహనాలు, బైక్‌లతో రేవిడి గ్రామం తరలివచ్చారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గంగరాజు, తెలుగు యువత మండల అధ్యక్షుడు సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు పావని, నగేష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి,సర్పంచ్ రమణ, అప్పలనాయుడు, వెంకటరావు, సురేష్, ఎర్నాయుడు, సన్యాసిరావు, పైడినాయుడు, జనసేన మండల అధ్యక్షుడు రామస్వామినాయుడు పాల్గొన్నారు.

కొమ్మాది : జీవీఎంసీ 5, 6 వార్డుల నుంచి కూడా టీడీపీ, జనసేన శ్రేణులు భారీ సంఖ్యలో సభకు తరలివెళ్లాయి. 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత ఆధ్వర్యంలోనూ, 6వ వార్డు నుంచి విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గొరె గురునాథ్ ఆధ్వర్యంలోనూ ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, బోయి రమాదేవి, నాగోతి సత్యనారాయణ, గొలగాని సన్యాసిరావు, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : జీవీఎంసీ 3, 4 వార్డుల నుంచి కూడా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. 3వ వార్డులో చిన్నబజారు పార్టీ కార్యాలయం నుంచి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. అలాగే 4వ వార్డు కె. నగరపాలెం నుంచి ఆ వార్డు అధ్యక్షుడు పాసి నర్సింగరావు, యువ నాయకుడు పాసి త్రినాథ్ కుమార్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీగా వెళ్లారు.

తెలుగుదేశం బీసీల పార్టీ : ఎమ్మెల్యే వెలగపూడి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 17 : తెలుగుదేశం బీసీల పార్టీ అని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. తమ పార్టీలో బీసీలకు విశేష ప్రాధాన్యత ఇస్తోందని, అందులోనూ యాదవులకు మరింత ప్రాధాన్యం దక్కిందన్నారు. శనివారం ఆయన ఎంవీపీ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో బీసీ, యాదవ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వంశీకృష్ణను అవమానించారు కనుకే ఆయన వైసీపీ నుంచి బయటకు వచ్చారన్నారు. ఎంవీవీ భూముల భక్షకుడు అని, ఎంపీగా ఆయన నగరానికి ఏం చేశారని ప్రశ్నించారు. వంశీ, తాను పోటీలో ఉన్నా, ఎవరూ వ్యక్తిగతంగా దూషణలకు దిగలేదని, తూర్పు నియోజకవర్గం ప్రజలకు ఎవరు ఎలాంటి వారో బాగా తెలుసునని చెప్పారు. ఎంవీవీ వచ్చిన తర్వాత విశాఖను రౌడీ రాజ్యంగా మార్చేశారని విమర్శించారు. రైల్వేజోన్‌కు స్థలం ఇవ్వమంటే ముడసర్లోవ క్యాచ్‌మెంట్ ఏరియాను కేటాయించారని, ఆ సమస్యను కూడా ఎంపీ పరిష్కరించలేకపోయారని ఎద్దేవా చేశారు.

'వైసీపీలో యాదవులు డమ్మీ'

వైసీపీ ప్రభుత్వంలో యాదవులకు పేరుకే పదవులిచ్చి డమ్మీలుగా మార్చేస్తారని యాదవ నాయకులు ఆరోపించారు. మేయర్ కూడా రెడ్డిల వెనుక ఉంటారని, కనీసం ప్రోటోకాల్ పాటించరన్నారు. ఎంవీవీ వెనుక ఉన్న కార్పొరేటర్లు కూడా డమ్మీలేనని విమర్శించారు. ఎంవీవీ వ్యాపారాలేంటో తెలుసు అని, ఎమ్మెల్యే జోలికి గాని, యాదవుల జోలికి వస్తే దారుణ పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నాలుగోసారి కూడా అత్యధిక మెజారిటీతో వెలగపూడి గెలుస్తారని చెప్పారు. ఎమ్మెల్యే అన్ని వర్గాల వారిని ఆదరిస్తారన్నారు. ఈ సమావేశంలో యాదవ నాయకులు బొట్టా వెంకటరమణ, ఒమ్మి అప్పలరాజు, నక్క కనకరాజు, ఒమ్మి పోలరావు, గొలగాని పోలరావు, గొలగాని పురుషోత్తం, పీతల అవినాష్, ముగడ రాజారావు, మొల్లి శంకర్, దువ్వి తాతారావు, ఒమ్మి అప్పారావు, మద్దిల రాజశేఖర్ పాల్గొన్నారు.

గీతంలో విదేశీ విద్యార్థుల సందడి

సాగర్‌నగర్, ఫిబ్రవరి 17 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ విద్యార్థుల యువజనోత్సవం ఉత్సాహంగా జరుగుతోంది. శనివారం పలు విద్యాసంస్థల నుంచి భారీ సంఖ్యలో విదేశీ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ప్రదర్శించిన సంగీత, నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తమ దేశాల సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేషధారణలతో ఇచ్చిన ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో ఉగాండ దేశ విద్యా క్రీడల మంత్రిత్వ శాఖ సహాయ కమిషనర్ డాక్టర్ టి. బైగాన ఎడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలని కరపత్రాలు పంపిణీ

ఆనందపురం, ఫిబ్రవరి 17 : ప్రభుత్వం తక్షణమే సీపీఎస్‌ను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన తర్లువాడ గ్రామంలో సీపీఎస్ రద్దు కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల్లో సీపీఎస్ రద్దు చేస్తానని నాటి ప్రతిపక్ష నేతగా జగన్ హామీ ఇచ్చారని, దాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పాడ రాము, కార్యవర్గ సభ్యులు వై. భాస్కర్, ఆనందపురం మండల అధ్యక్షుడు కిరణ్, కోశాధికారి రాజశేఖర్, రాంజీ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు : జేసీ


ఆనందపురం, ఫిబ్రవరి 17 : అర్హులందరికీ ఇళ్ల పట్టాలు అందజేస్తామని జేసీ మయూర్ అశోక్ పేర్కొన్నారు. శనివారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో నియోజవర్గంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు జరుగుతున్న ఇళ్ల పనులను సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు పెండింగ్ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అర్హుల జాబితా తయారు చేసినట్లయితే పట్టాలు మంజూరు చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ అర్హులకు ఇళ్ల స్థలాలు అందజేయాలని, స్థలాలు లేకపోతే ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలన్నారు. సమావేశంలో ఆర్డీవో భాస్కరరెడ్డి, తహసీల్దార్ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

ఎంపీ కాగానే యువతకు ఉద్యోగాలు : కేఏ పాల్

సిరిపురం, ఫిబ్రవరి 17 : తనను విశాఖ ఎంపీగా గెలిపిస్తే వంద రోజుల్లో నగరంలోని యువతకు ఉద్యోగాలు కల్పిస్తానని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. కేఏ పాల్ అన్నారు. శనివారం రాత్రి ఆయన ఆశీలమెట్టలోని కేఏ పాల్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశాఖలో ఎక్కువ మంది యువత ఖాళీగా ఉన్నారని, తాను ఎంపీ అయిన వంద రోజుల్లో ఉద్యోగాలు ఇస్తానని చెప్పారు. తనను నమ్మి యువత ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు

వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

ఎండాడ, ఫిబ్రవరి 17 : వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు పని చేయాలని ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. శనివారం ఆయన ఎండాడలో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో ఉత్తరాంధ్రలోని 34 నియోజకవర్గాల సమన్వయకర్తలు, పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, వాటిని నాయకులు అమలు చేయాలన్నారు. సమావేశంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యేలు రాజన్నదొర, ధర్మాన కృష్ణదాస్, తిప్పలనాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్ , గొల్ల బాబూరావు, పుష్ప శ్రీవాణి, ఎమ్మెల్సీ కళ్యాణి, నాయకులు కేకేరాజు, మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల సమస్యలు పరిష్కరించాలి : ఐద్వా

ఆరిలోవ, ఫిబ్రవరి 17 : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే డ్వాక్రా మహిళల సమస్యలను పరిష్కరించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి. ప్రభావతి డిమాండ్ చేశారు. శనివారం ఆమె ఆరిలోవలో ఏర్పాటు చేసిన డ్వాక్రా మహిళల సదస్సులో మాట్లాడారు. రాష్ట్రంలో కోటి మంది డ్వాక్రా మహిళలు ఉన్నారని, వారు పొదుపు చేసిన డబ్బులు ఇవ్వకుండా బ్యాంకు అధికారులు అడ్డుపడుతున్నారని, రుణమాఫీ కూడా అరకొరగా జరుగుతుందన్నారు. సభలు, సమావేశాలకు రాకపోతే సంక్షేమ పథకాలు వర్తించవని బెదిరించడం దుర్మార్గపు చర్య అన్నారు. ఈనెల 22 నుంచి 25 వరకు ఐద్వా ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కమిటీ సమావేశాలు జరగనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి జి. ప్రియాంక, సభ్యులు ఎస్. రంగమ్మ, ఆర్. రమణమ్మ, ఎం. లక్ష్మి, అమ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకుడు ముత్యాలరావు

కొనసాగుతున్న ఉద్యోగుల ఆందోళన

భీమునిపట్నం, ఫిబ్రవరి 17 : ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనుదారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేవరకూ పోరాటం ఆగదని ఉద్యోగుల జేఏసీ భీమిలి తాలూకా యూనిట్ నాయకులు స్పష్టం చేశారు. శనివారం వారు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరల వల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే 30 శాతం ఐఆర్, పెండింగ్‌లో వున్న డీఏలు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవోల సంఘం భీమిలి తాలూకా అధ్యక్షుడు ఎం. లోవరాజు, కార్యదర్శి కాళ్ల సాయిబాబు, నాయకులు కంటుభుక్త ముత్యాలరావు, రామకృష్ణ, భీమారావు, ఆనందరావు, శివప్రసాదరావు, భారతి, అప్పలరాజు, కోటేశ్వరరావు, సతీష్, వెంకటరమణ పాల్గొన్నారు.

తగరపువలసలో రైతుబజారు ప్రారంభం

తగరపువలస, ఫిబ్రవరి 17 : స్థానిక గ్రంథాలయం వీధిలో నూతనంగా నిర్మించిన రైతుబజారును జాయింట్ కలెక్టరు విశ్వనాథన్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు రూ. 86 లక్షలతో రైతుబజారును ఏర్పాటు చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందనడానికి ఇదే నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సూర్యనారాయణ, కార్పొరేటర్ ప్రభావతి, వైసీపీ నాయకులు రమేష్, రామునాయుడు, కరుణాకరరెడ్డి పాల్గొన్నారు. కాగా రైతుబజారు ప్రారంభోత్సవం జరిగినప్పటికీ రైతులకు ఇంకా దుకాణాలు కేటాయించలేదు. దుకాణాల కేటాయింపు తరువాత కార్యకలాపాలు జరుగుతాయని మార్కెటింగ్ శాఖాధికారులు తెలిపారు.

బాలల సంక్షేమాన్ని మేనిఫెస్టోలో చేర్చాలి

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 17 : రాజకీయ పార్టీలు బాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ఎన్నికల మేనిఫెస్టోలో తగిన ప్రాధాన్యమివ్వాలని బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు కోరారు. శనివారం ఆయన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రకాశరావు మాట్లాడుతూ 18 ఏళ్ల వరకూ పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య అందించాలన్నారు. వినతి పత్రాన్ని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌కు అందజేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయనతో పాటు బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యక్షుడు డాక్టర్ గ్యానేశ్వర బాబ్జి కూడా ఉన్నారు.

మామిడి తోట ఫలసాయం వేలం వాయిదా

పద్మనాభం, ఫిబ్రవరి 17 : మండలంలోని పొట్నూరు కోదండరామస్వామి ఆలయానికి చెందిన మామిడి తోట ఫలసాయం కోసం నిర్వహించిన వేలం పాట వాయిదా పడినట్టు పద్మనాభం గ్రూపు ఆలయాల ఈఓ నానాజీబాబు చెప్పారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వేలానికి పాటదారులు ఎవరూ రాకపోవడంతో వాయిదా వేశామన్నారు. తదుపరి తేదీలను త్వరలో తెలియజేస్తామని తెలిపారు. కాగా ఈనెల 16న అనంతవరంలో నారాయణేశ్వరస్వామి ఆలయానికి చెందిన 9.97 ఎకరాల భూముల కౌలుకు నిర్వహించిన వేలంలో ఏడాదికి రూ.76 వేలు, రామాలయానికి చెందిన 3.45 ఎకరాల కౌలుకు రూ. 26 వేలకు కొందరు రైతులు పాడుకున్నారన్నారు. వారి వద్ద నుంచి తొలి ఏడాది శిస్తు కూడా కట్టించుకున్నామని ఆయన చెప్పారు.

అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



బస్సు టికెట్లకు భక్తుల క్యూ

సింహాచలం, ఫిబ్రవరి 17 : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులతో శనివారం అధిక సంఖ్యలో తరలి వచ్చారు. శుక్రవారం రాత్రి నుండే పలు ప్రాంతాల నుంచి భక్తులు సింహాచలం చేరుకున్నారు. శనివారం ఉదయం కొండదిగువ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి భైరవస్వామిని దర్శించుకుని అమృతకలశాలను మొక్కుబడులుగా సమర్పించారు. అక్కడి నుంచి సింహగిరికి మెట్లమార్గంలో, బస్సుల్లో చేరుకుని తలనీలాలు సమర్పించి గంగధారలో పవిత్ర స్నానాలు ఆచరించి తమ ఆరాధ్యదైవాన్ని దర్శించుకున్నారు.

ఏయూతో కలిసి ప్రాజెక్టుల నిర్వహణ

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 17 : ఏయూతో కలిసి పరిశోధన ప్రాజెక్టులు నిర్వహించాలని అమెరికాకు చెందిన ఈటాన్ రీసర్చ్ ల్యాబ్ సీనియర్ ప్రిన్సిపల్ ఇంజనీర్ డాక్టర్ విజయ్ భావరాజుని వీసీ ప్రసాదరెడ్డి కోరారు. శనివారం విజయ్ భావరాజు ఏయూను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వీసీతో భేటీ అయ్యారు. అనంతరం ప్రసాదరెడ్డి మాట్లాడుతూ పరిశోధనల్లో సంయుక్త భాగస్వామ్యంతో పనిచేయాలని ఆహ్వానించారు. వర్సిటీ తరపున విజయ్ భావరాజును వీసీ సత్కరించారు.

యోగ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ రేపు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 17 : సాగరేశ్వరాలయం ఆవరణలో యోగ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం జరగనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాంగణంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయాన్ని పునర్నిర్మించి, విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న సినీ నటి హేమ



రాజగోపురం వద్ద ఐఏఎస్ అధికారులు



కప్పస్తంభం వద్ద సినీ నటి హేమ

సింహాచలం, ఫిబ్రవరి 17 : వరాహలక్ష్మీనృసింహస్వామిని సినీనటి హేమ శనివారం దర్శించుకున్నారు. ఆమెకు పాలక మండలి సభ్యురాలు పెన్మెత్స శ్రీదేవి వర్మ, ఏఈఓ భ్రమరాంబ, పర్యవేక్షణాధికారి వెంకటరమణ స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం తరువాత అంతరాలయంలో అర్చకులు ఆమె పేరుతో పూజలు చేయగా గోదాదేవి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనాలివ్వగా, డిప్యూటీ ఈఓ సుజాత స్వామివారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం హేమ విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం క్రిష్ దర్శకత్వంలో అవసరాల శ్రీనివాస్, కోటా శ్రీనివాసరావు, తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న కన్యాశుల్కం వెబ్ సీరీస్‌లోనూ, లేచింది మహిళా లోకం అనే మరో వెబ్ సీరీస్‌లో నటిస్తున్నానని చెప్పారు. అలాగే పలువురు ఐఏఎస్ అధికారులు కూడా స్వామివారిని దర్శించుకున్నారు. స్వామిని దర్శించుకున్న వారిలో కేంద్ర బొగ్గు శాఖ అదనపు కార్యదర్శి నాగరాజు, జీఎస్‌టీ కమిషనర్ (ఐఆర్‌ఎస్) గిరిరాజ్ మీన, కాగ్ డిజీ రాజన్ పాండే, ఇండియన్ రైల్వే చీఫ్ ఇంజినీర్ రవినేష్ కుమార్, సంజయ్ గార్గ్ ఉన్నారు. వారికి ఆలయ ఏఈఓ భ్రమరాంబ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు.

బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శిగా కదిరి రాము

సిరిపురం, ఫిబ్రవరి 17 : ఆంధ్రప్రదేశ్ బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నగరానికి చెందిన కదిరి రాము నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు బి. పరంజ్యోతి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాము విలేకరులతో మాట్లాడుతూ బహుజన్ సమాజ్ పార్టీ బీసీలకు పెద్దపీట వేసిందని, మార్పు రావాలి... తీర్పు మారాలి అంటే బీఎస్పీతోనే సాధ్యమని చెప్పారు.

బైబిల్ సాహిత్య పుస్తక ప్రదర్శన

సిరిపురం, ఫిబ్రవరి 17 : పాత జైల్ రోడ్డులోని ది ఇండియన్ పెంతెకోస్తల్ చర్చి ఆఫ్ గాడ్‌లో శనివారం నుంచి బైబిల్ సాహిత్య పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు నిర్వాహకుడు రూఫస్ తెలిపారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పుస్తక ప్రదర్శన ఈనెల 21 వరకు ఉంటుందని, దైవిక శాస్త్రాలు, వేలాది గ్రంథాలు, వ్యాఖ్యానాలు, స్టడీ బైబిల్స్ ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

కేన్సర్ నిరోధక ఉచిత వ్యాక్సిన్



వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ షరీన్ రహమాన్

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 17: గర్భకోశ ముఖ ద్వార కేన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలని చైతన్య స్రవంతి సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షరీన్ రహమాన్ పేర్కొన్నారు. శనివారం ఏవీఎస్‌కాలేజీ వద్ద కమ్యూనిటీ హాల్‌లో 9 నుంచి 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా సెర్వైకల్ క్యాడ్రీ వ్యాలెంట్ వ్యాక్సిన్‌ను వేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భకోశ ముఖద్వార ముఖద్వారా కేన్సర్ నియంత్రణకు వ్యాక్సిన్ ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఉచితంగా వ్యాక్సిన్లు అందిస్తున్నామన్నారు. తొలి విడత 50 మంది బాలికలకు వేసినట్టు తెలిపారు ఒక డోస్ వ్యాక్సిన్‌కు బయట రెండు వేల వరకు ఖర్చవుతుందన్నారు. రెండో డోస్‌ను ఆరు నెలల తర్వాత అందిస్తామన్నారు. కేజీహెచ్ అంకాలజీ విభాగధిపతి డాక్టర్ పాండురంగకుమారి మాట్లాడుతూ ఈవ్యాక్సిన్ 80 శాతం మందికి రక్షణగా నిలుస్తుందన్నారు. వివాహం తర్వాత కూడ వ్యాక్సిన్ డోస్‌లు వేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వ్యాక్సిన్ సరఫరా సంస్థ ఏరియా మేనేజర్ రాంప్రసాద్, చైతన్య స్రవంతి ప్రతినిధులు రకియాభాయి, విజయ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న అధ్యక్షుడు చంద్రమౌళి

మురళీనగర్, ఫిబ్రవరి 17 ; మురళీనగర్ వాకర్స్ క్లబ్ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి తెలిపారు.. శనివారం క్లబ్ వేదిక వద్ద కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిపిన సభ్యత్వ నమోదు ద్వారా రూ. 50 వేలు సమకూరినట్లు తెలిపారు. ఈనెల 21న ప్రపంచ మాతృభాషా దినోత్సవం నిర్వహణ, మార్చి 8న మహిళా దినోత్సవం, వైద్య శిబిరాలు తదితర సామాజిక కార్యక్రమాల్ని చేపట్టనున్నట్లు సభ్యులకు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి వాకర్ కూర్మారావు, సెక్రటరీ పి.చెల్వరాజు, పూర్వ అధ్యక్షులు, ప్రత్యేక ఆహ్వానితులు మాట్లాడారు. వాకర్స్ క్లబ్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

యూసీసీ టి-20 క్రికెట్ పోటీలు



సాత్విక్‌కు అవార్డు అందిస్తున్న రమాకాంత్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 17: వాల్తేరు రైల్వే స్టేడియంలో జరుగుతున్న యూసీసీ టీ 20 క్రికెట్ చాంపియన్‌షిప్ టోర్నీలో కవలియర్స్ సీసీ, గెలాక్సీ సీసీ జట్లు ఫైనల్స్‌కు చేరాయి. శనివారం జరిగిన తొలి సెమీస్‌లో కవలియర్స్ సీసీ ఏడు వికెట్ల తేడాతో మెట్రో సీసీపై విజయం సాధించింది.ఆల్‌రౌండర్ వరుణ్ సాత్విక్‌కు ప్లేయిర్ ఆఫ్ మ్యాచ్ అవార్డును యూసీసీ ప్రతినిధి రమాకాంత్ అందించారు.

లోకేశ్ శంఖారావానికి సర్వం సిద్ధం

- ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సభ
- విజయవంతం చేయాలి: టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ

మహారాణిపేట, ఫిబ్రవరి 17: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం నిర్వహించనున్న నిర్వహించనున్న శంఖారావం సభను విజయవంతం చేయాలని సౌత్ ఇన్‌చార్జ్ గండి బాబ్జీ కోరారు . శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, లోకేశ్ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు మున్సిపల్ స్టేడియంలో సభ ప్రారంభం కానుందన్నారు.నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విచ్చేసి సభను విజయవంతం చేయాలని కోరారు. లోకేశ్ యువగళం పాదయాత్రలో వెళ్లని నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారన్నారు. లోకేశ్ సభలకు జనంనుంచి విశేష స్పందన వస్తుందని తెలిపారు. అలాగే, యాత్ర సినిమాకు ఆదరణ కరువైందని.. రాజధాని సినిమాపై ప్రేక్షకులు విశేష ఆదరణ చూపుతున్నారు. ఈ సినిమాలో జగన్ మోసాలను తెలుసుకుంటున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జగన్ గద్దెదిగడం ఖాయమని అన్నారు. అలాగే, ఇందిరా గాంధీ స్టేడియంలో ఆదివారం మధ్యాహ్నం యువనేత నారా లోకేశ్ నిర్వహించనున్న శంఖారావం సభ ఏర్పాట్లను శనివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ నజీర్‌తోపాటు నాయకులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. దక్షిణ నియోజకవర్గ ప్రజలు వచ్చి సభ విజయవంతం చేయాలని కోరారు.

సభను ప్రజలు పెద్ద సంఖ్యలో రావాలి



స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న గండి బాబ్జీ, నాయకులు

డాబాగార్డెన్స్: నారా లోకేశ్ శంఖారావం కార్యక్రమానికి 31వ వార్డు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి వానపల్లి గాయత్రిఫణికుమారి పిలుపునిచ్చారు.శనివారం వార్డు కార్యాలయంలో ఇన్‌చార్జి గండిబాబ్జీ ఆదేశాల మేరకు సమావేశమయ్యారు. ఆదివారం 12.30 గంటలకు ప్రారంభంకానున్న ఈ సభకు ప్రజలను అధిక సంఖ్యలో తరలించాలని కోరారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి రావడమే ధ్యేయంగా ప్రతీ ఒక్కరూ పనిచేయాలని కోరారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు సారిపల్లి మహేష్, నాని, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యం కల్పించే పార్టీకే మద్దతు

- ఉత్తరాంధ్ర తూర్పు కాపు సంఘం అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు



సంఘీ భావం తెలుపుతున్న నాయకులు

మహారాణిపేట, ఫిబ్రవరి 17: ఉత్తరాంధ్ర జిల్లాలో అత్యధికంగా ఉన్న తూర్పు కాపులకు తగిన స్థాయిలో అసెంబ్లీ, పార్లమెంట్ టికెట్లు కేటాయించాలని ఉత్తరాంధ్ర తూర్పు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసనాయుడు వివిధ పార్టీలను డిమాండ్ చేశారు. శనివారం జడ్పీ జంక్షన్ వద్ద ఓ సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపుల పేరుతో తూర్పు కాపులకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. ఉత్తరాంధ్రలో తూర్పు కాపులు 30 లక్షల మందికి పైగా ఉన్నారన్నారు. జనాభా దామాషా ప్రకారం ఉమ్మడి శ్రీకాకుళం విజయనగరం, విశాఖ జిల్లాలో అధిక టికెట్లు కేటాయించాలన్నారు. కానున్న రోజులలో వలస నాయకులు వద్దు.. స్థానిక నాయకులు ముద్దు అనే నినాదంతో ముందుకు వెళ్తామన్నారు. తూర్పు కాపులకు సీట్లు ఇచ్చే పార్టీలకు అండగా ఉంటామన్నారు. ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర గౌరవ అధ్యక్షుడు లంకా మోహనరావు , బి సుధాకర్, గణేష్, రెడ్డి వెంకటరమణ, కల్యాణ గోపి, అసిరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేద వర్గాల సేవే రోటరీ క్లబ్ లక్ష్యం

- రోటరీ గవర్నర్ దత్త సుబ్బారావు



సేవలను వివరిస్తున్న రోటరీ గవర్నర్ దత్తా సుబ్బారావు

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 17: పేద వర్గాల సేవే లక్ష్యంగా రోటరీ క్లబ్ పనిచేస్తోందని రోటరీ గవర్నర్ దత్త సుబ్బారావు తెలిపారు. శనివారం నగరం విశాఖ పోర్టు సిటీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రోటరీ ద్వారా పోలియో 99.9 శాతం నిర్మూలించినట్టు చెప్పారు. విశాఖ పోర్టు సిటీ పోలియో నిర్మూలనకు రూ. 2 లక్షలు, రోటరీ ఫౌండేషన్ కోసం మరో రూ. 3.50 లక్షల విరాళం అందించడంపై ఆయన అభినందనలు తెలిపారు. రోటరీ విశాఖ పోర్టుసిటీ నగరంలోని ప్రభుత్వ బాలిక హాస్టల్స్, జువైనల్ హోమ్స్‌లకు ఉచితంగా పరుపులు అందించినట్టు చెప్పారు. కుట్టుమిషన్లు, బాలికల అంధుల పాఠశాలకు ఫర్నీచర్ చేకూర్చామని, బాలికలకు స్కాలర్ షిప్‌లనందిస్తున్నట్టు పేర్కొన్నారు. పెదవాల్తేరు కంటి ఆసుపత్రి వద్ద రోటరీ డయాగ్నస్టిక్ సెంటర్ ద్వారా తక్కువ ధరకు ఆరోగ్య పరీక్షలందిస్తున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో రోటరీ జిల్లా గవర్నర్ జి.విశ్వనాథ్, పూర్వఅధ్యక్షుడు జీఎస్‌రాజు, కార్యదర్శి ఎస్ఎస్ఎన్ రాజు, కోశాధికారి కె.వి.రమణ, రోటేరియన్లు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయమైన కోర్కెలను వెంటనే పరిష్కరించాలి

- ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ ఈశ్వరరావు



నల్లబాడ్జీలు ధరించి ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

మహారాణిపేట, ఫిబ్రవరి 17: ఉద్యోగుల బకాయిలను చెల్లించడంతో న్యాయమైన కోర్కెలను వెంటనే పరిష్కరించాలని అమరావతి జేఏసీ విశాఖ జిల్లా చైర్మన్ కె. ఈశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా శనివారం కలెక్టరేట్ జంక్షన్‌లోని ఎన్‌జీవో భవన్‌లో ఆవరణలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లుగా ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రివర్స్ పీఆర్‌సీ, సంవత్సరాల తరబడి సరండర్‌లీవ్‌లు ఎగవేస్తోందన్నారు. దాచుకున్న డబ్బు కూడా ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కోరారు ఈ సమావేశంలో ఉద్యోగ నాయకులు రొంగలి రవిశంకర్ కె శ్రీనివాసరావు, డీడీ ప్రసాదరావు , దాసరి నాగేశ్వరరావు, దశరధరామి రెడ్డి, ఎస్ సత్తిబాబు, ఎన్ చంద్ర శేఖర్, పి.అప్పలరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అయోధ్య పాదుకలతో రథయాత్ర



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సీతంపేట, ఫిబ్రవరి 17: రామనామంతో సీతంపేటవీధులు మార్మోగాయి. రాధాకృష్ణ మందిరం నుంచి ప్రధాన కూడలిలోని దుర్గాగణపతి ఆలయం వరకు అయోధ్యరాముని పాదుకలను రథంపై ఊరేగించారు. వార్డు కార్పొరేటర్ మాజీ జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు సారిపిల్లి గోవింద్ ఆర్థిక సహాయంతో ఈ యాత్రను సీతంపేట షిరిడీ సాయిబాబా భజన మండల్, సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ యాత్రను కార్పొరేటర్ గోవింద్ జెండా ఊపి ప్రారంభించారు. భక్తులు సారిపిల్లి గంగరాజు, బోర వెంకట రమణ, నమ్మి వెంకట్, సన్నీ, గుడివాడ గౌరీ నాయుడు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై అవగాహన

మహారాణిపేట, ఫిబ్రవరి 17: విదేశాలలో విద్యను అభ్యసించాలనుకునే వారికి నిపుణులతో అవగాహన శిక్షణ అందించనున్నట్లు యూనీ సంస్థ మేనేజర్ కె. అనిత తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మా ట్లాడారు. ఈ నెల 19వ తేదీన ఆస్ట్రేలియా అడిషన్సు డే నిర్వహిస్తున్నామన్నారు. పదికి పైగా ఆస్ట్రేలియా యూనివర్సిటీలు ఆరోజు పాల్గొంటున్నాయన్నారు. విద్యార్థుల అర్హత ప్రకారం అవకాశాలు లభిస్తాయన్నారు.

ఆర్థిక రాజధానిగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నాడని దుయ్యబట్టారు. తాము విశాఖను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేయడంతోపాటు ఫ్లై ఓవర్‌లు, అండర్ బ్రిడ్జిలు నిర్మించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. మెడికల్ డివైస్ తయారీ హబ్‌గా, ఐటీ కేంద్రంగా విశాఖను తీర్చిదిద్దుతామని లోకేష్ స్పష్టంచేశారు. ఏటా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని, ఉద్యోగం వచ్చేంత వరకు మూడు వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామని నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. భీమిలి నియోజకవర్గంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, 2019 ఎన్నికల్లో తనను ఇక్కడి నుంచి పోటీ చేయాల్సిందిగా చంద్రబాబు చెప్పారన్నారు. కానీ, ఇప్పటివరకు టీడీపీ గెలవని స్థానాన్ని కోరి మరీ మంగళగిరి నుంచి తాను పోటీ చేశానని, స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యానన్నారు. భీమిలి నుంచి పోటీ చేస్తే తనతోపాటు భరత్ కూడా నెగ్గేవాడని, ఆ మాట ఇప్పటికీ భరత్ చెబుతుంటాడన్నారు. భవిష్యత్తులో కూడా భీమిలిని అభివృద్ధి చేసే బాధ్యతను తాము తీసుకుంటామని స్పష్టం చేశారు.

2014 నుంచి 2019 వరకు ఇక్కడ వేయి కోట్ల అభివృద్ధి పనులు చేశామని, ఇండోర్ స్టేడియం, మిలీనియం టవర్ ఏర్పాటుచేయడంతోపాటు టిడ్కో ఇళ్లను నిర్మించామన్నారు. 2019లో భీమిలి నియోజకవర్గ ప్రజలు పాలిచ్చే ఆవును కాదని, తన్నే దున్నపోతును గెలిపించుకున్నారన్నారు. అర గంట అవంతి మంత్రిగా పనిచేసినా ఇక్కడి అభివృద్ధి పనులు చేయలేదని, ప్రజల జీవితాల్లో మార్పులు రాలేదన్నారు. ఆయనకు రాసలీలలు మాత్రమే తెలుసునని ఎద్దేవా చేశారు. ఆయన వ్యవహారాన్ని చూడలేక ఇక్కడి ప్రజలు తలదించుకునే పరిస్థితి దాపురించిందన్నారు. వైసీపీ నాయకులు అవినీతికి కేరాఫ్‌గా భీమిలిని మార్చారని, రాష్ట్రంలోని నాయకులంతా ఇక్కడి భూములపై పడ్డారని ఆరోపించారు. ఈ ప్రాంతానికి చెందిన రూ.2500 కోట్ల విలువైన భూములను వైకాపా నాయకులు దోచుకున్నారన్నారు. అరగంట అవంతి అవినీతి పెరిగిపోయిందని, అనేక పోస్టులు అమ్ముకున్నాడని, జూట్ ఫ్యాక్టరీ నుంచి డబ్బులు తీసుకుని కార్మికులకు న్యాయం చేయలేదని ఆరోపించారు. తనకు అక్కా, చెల్లెళ్లు, అన్నదమ్ములు లేరని, 60 లక్షల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలే తనకు అక్క, చెల్లెళ్లు, అన్నదమ్ములన్నారు. టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మూడుచోట్ల లోకేశ్ సభలు

ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తూర్పు నియోజకవర్గ పరిధిలోని అప్పుఘర్ వద్ద గల గాదిరాజు ప్యాలెస్ సమీపాన, రెండు గంటలకు విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఏర్పాటుచేసే సభల్లో లోకేశ్ పాల్గొంటారు. అక్కడ నుంచి సాయంత్రం ఐదు గంటలకు విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని గోపాలపట్నం పెట్రోల్ బంకు సమీపాన వెంకటాపురంలో నిర్వహించనున్న సభలో పాల్గొంటారు. ఆదివారం రాత్రి విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని బిర్లా జంక్షన్ సమీపాన గల హోండా షోరూమ్ వద్ద బస చేస్తారు.

ఉత్తరాంధ్రకు పట్టిన దరిద్రం జగన్

... 5వ పేజీ తరువాయి

తీసుకువస్తే జగన్ బూమ్‌బూమ్, ప్రెసిడెంట్ మెడల్ వంటి మద్యం బ్రాండ్లు తీసుకువచ్చారన్నారు.

నవ మోసాలు: ఎన్నికల ముందు నవరత్నాలు అని ఊదరగొట్టిన జగన్, అధికారంలోకి వచ్చిన తరువాత దానిని నవ మోసాలుగా చేశారని లోకేశ్ ధ్వజమెత్తారు. మద్య నిషేధం చేసిన తరువాతే ఓట్లు అడుగుతానని ప్రజలను నమ్మించిన వ్యక్తి... మాట తప్పడమే కాకుండా నేడు వీధివీధినా మద్యం అమ్ముతున్నారన్నారు. ప్రజల కష్టాలు చూసి చంద్రబాబు సూపర్ సిక్స్ ప్రకటించారని గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేస్తామని ప్రకటించారు. బూత్ స్థాయి అధ్యక్షులు, ముఖ్యమైన నాయకులు రానున్న రెండు నెలల్లో ప్రజల్లోకి వెళ్లి సూపర్ సిక్స్ కోసం ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. సభలో పెందుర్తి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బండారు సత్యనారాయణమూర్తి, జనసేన రూరల్ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడారు. అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి కేడర్‌కు లోకేశ్ సూపర్ సిక్స్ కిట్లు పంపిణీ చేశారు.

తహసీల్దార్ రమణయ్య బంధువు రాజేంద్ర మృతి

... 5వ పేజీ తరువాయి

తరలించారు. ఇదిలావుండగా తహసీల్దార్ బంధువుగా చెప్పుకుంటున్న ప్రధాన రాజేంద్ర శుక్రవారం మృతిచెందడం చర్చనీయాంశంగా మారింది. పోలీసులు, ప్రసాద్, తదితరుల ఒత్తిళ్లను తట్టుకోలేకే రాజేంద్ర మృతిచెందాడంటూ ప్రచారంజరిగింది. అయితే రాజేంద్ర భార్య త్రివేణి మాత్రం తన భర్తకు గుండెపోటు రావడం వల్లే మృతిచెందారని, ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదని స్పష్టంచేశారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కోటపాటు కొత్తూరుకు చెందిన ప్రధాన రాజేంద్ర పదేళ్ల కిందట విశాఖ వచ్చి ఎంవీపీకాలనీలోని గాదిరాజు ఎంపైర్స్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. భార్య త్రివేణితోపాటు ఏడేళ్ల కుమార్తె ఉంది. రాజేంద్ర కొంతకాలం కిందటి వరకూ అనకాపల్లిలో మహీంద్ర ట్రాక్టర్ల షోరూమ్ నిర్వహించేవారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కొనసాగుతున్నారు. కాగా త్రివేణి కథనం ప్రకారం..మధుమేహం కలిగి ఉన్న రాజేంద్ర శుక్రవారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఒక్కసారిగా షుగర్ లెవెల్స్ పెరిగిపోవడంతో కుప్పకూలిపోయారు. వెంటనే షీలానగర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించామని, అక్కడ చికిత్స పొందుతూ రాత్రి పది గంటల సమయంలో మృతిచెందారు. కార్డియాక్ అరెస్టు వల్లే రాజేంద్ర మృతిచెందినట్టు వైద్యులు కూడా నిర్ధారించారన్నారు. తన భర్త అంత్యక్రియలు కూడా పూర్తయినందున ఆ విషయాన్ని అక్కడితో వదిలేయాలని ఆమె కోరారు. తన భర్త మృతి చెందడంతో ఏడేళ్ల కుమార్తెతో ఎలా బతకాలో తెలియని స్థితిలో ఉన్న తమను కొన్ని టీవీ ఛానల్స్ తప్పుడు వార్తలు ప్రసారం చేసి మనోవేదనకు గురిచేస్తున్నారని వాపోయారు. ఏదైనా లేనిపోని అనుమానాలతో కథనాలు ప్రసారం చేస్తే ఆయా మీడియా సంస్థల పేరు చెప్పి తన కుమార్తెతో కలిసి ఆత్మహత్య చేసుకోవడం ఒక్కటే తనకు మార్గమని త్రివేణి ఆవేదన వెళ్లగక్కారు.

కారు బీభత్సం

... 5వ పేజీ తరువాయి

వచ్చి డ్రైవర్‌ను తనతో తీసుకువెళ్లేందుకు యత్నించాడు. పోలీసులు అడ్డుకోవడంతో వారితో వాగ్వాదానికి దిగాడు.

మద్యం మత్తులోనే...?

కారు డ్రైవర్ అలజంగి గణేష్ మత్తుగా ఉండడంతో పాటు ఏమి జరిగిందో తెలియని స్థితిలో ఉండడాన్ని స్థానికులు గమనించారు. అతడు మద్యం సేవించి ఉన్నాడని చెబుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత అతడిని స్థానికులు విచారించగా తనది పెదవాల్తేరని, పెళ్లిలో కారు నడిపేందుకు ఆఫ్టింగ్ డ్రైవర్‌గా వచ్చానని తెలిపాడు. రాత్రంతా మద్యం సేవించానని వివరించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ ఎస్‌ఐలు బి.తిరుపతిరావు, వి.కనకారావు, ఏఎస్ఐ ప్రసాద్ వివరాలను సేకరించారు. గాయపడిన లక్ష్మణ్, డ్రైవర్ గణేష్‌లను ఆస్పత్రికి తరలించారు. జగదీశ్వరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురికి తరలించారు.

తల్లడిల్లిన తనయుడు

నక్కవానిపాలెం రామాలయం వీధికి చెందిన జగదీశ్వరి అలియాస్ జగదీ కూలీ. ఆమె భర్త పదేళ్ల కిందటే అనారోగ్యంతో మృతి చెందాడు. కుమారుడు పోలిశెట్టి గణేష్‌తో కలిసి జీవిస్తోంది. తన రెక్కల కష్టంతో అతడిని ఇంటర్ చదివిస్తోంది. ప్రమాదంలో తల్లి మృత్యువాత పడడంతో కుమారుడు గణేష్ బోరున విలపిస్తున్నాడు. ఉన్న ఒక్కగానొక్క ఆధారం తిరిగిరాని లోకాలకు తరలిపోయిందని, ఈ లోకంలో తనకంటూ ఇంకెవరూ లేరని, ఎలా బతకాలని, ఎవరు చదివిస్తారని వెక్కివెక్కి ఏడుస్తున్న అతడిని ఓదార్చడం ఎవరితరం కావడం లేదు.

డ్రైవర్‌కు ఫిట్స్?

ఆఫ్టింగ్ డ్రైవర్‌గా వచ్చిన గణేష్‌కు కారు నడుపుతుండగా ఫిట్స్ రావడంతోనే ప్రమాదం జరిగిందని కారు యజమాని చెబుతున్నాడు. అయితే కేసు తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిట్స్ వస్తే కారును అంతదూరం ఎలా నడిపాడని, ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్‌ను కారులోనుంచి తామే బయటకు తీశామని, అప్పుడు మామూలుగానే ఉన్నాడంటున్నారు. ఫిట్స్ వస్తే నోటిలో నురగలు కూడా వస్తాయని, కేసు నుంచి తప్పించేందుకే యజమానితప్పుడు సమాచారం ఇస్తున్నాడని చెబుతున్నారు.

'అవినీతి రహిత పాలనే ధ్యేయం'

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 17: అవినీతి రహిత పాలనే ధ్యేయంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆల్ తెలుగు ప్రజా పార్టీ ఏర్పాటుచేసినట్టు ఆల్ తెలుగు ప్రజా పార్టీ విశాఖ పార్లమెంట్ పరిశీలకురాలు ఎన్.సంధ్యా అన్నారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏటీపీపీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రినిచేయడమే ధ్యేయమన్నారు. ఇప్పటివరకు ఉన్నపార్టీలు అవినీతిని ప్రోత్సహిస్తూ ప్రజా సంక్షేమాన్ని గాలికివదిలేసి కుటుంబ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ స్థితిలో తమతో కలిసి వచ్చే పార్టీలను కలుపుకొని ముందుకు వెళ్తామన్నారు. నేతలు సాయేశ్వరరావు,గంటిమోహనరావు పాల్గొన్నారు.

'విశ్వబ్రాహ్మణులకు ' దక్షిణ' టికెట్ ఇవ్వాలి'



మాట్లాడుతున్న విశ్వబ్రాహ్మణ సంఘాల నేత అప్పలాచారి

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 17: దక్షిణ నియోజకవర్గంలో అత్యధిక శాతం ఉన్న విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గానికి ప్రధాన రాజకీయ పార్టీలు ప్రాధాన్యత కల్పించి వచ్చే ఎన్నికల్లో టికెట్లు కేటాయించాలని విశ్వబ్రాహ్మణ మహాసేన (బీసీ) ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ నేత తాళాబత్తుల అప్పలాచారి మాట్లాడారు. ఇప్పటి వరకు విశ్వబ్రాహ్మణులకు ఏ పార్టీ సరైన గుర్తింపు ఇవ్వలేదని విచారం వ్యక్తం చేశారు. విశ్వబ్రాహ్మణుల జనాభా ఆంధ్రప్రదేశ్‌లో 24 లక్షల మంది ఉన్నారన్నారు. కాశీ సన్యాసిరాజు, కె. సూర్య, ఎ.శ్రీనివాస్ మాట్లాడారు. శివకోటి వాసు, గోడి నరసింహచారి, విశ్వబ్రాహ్మణ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళాబత్తుల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బోదలపాటి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కెమికల్ విద్యార్థులకు పురస్కారాలు



పురస్కార గ్రహీతలతో ప్రిన్సిపాల్ రమణ, పూర్వవిద్యార్థులు

కంచరపాలెం, ఫిబ్రవరి 17: స్థానిక ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగేళ్లలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు శనివారం ప్రతిభా పురస్కారాల ప్రదానం చేశారు. తొలుత బ్యాచ్ (1971-75) నుంచి నేటి వరకు కళాశాల కళాశాలలో చదువుకుని ఉన్నతస్థాయిలో ఉన్న పూర్వవిద్యార్థులు ముందుగా ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు కళాశాలతో తమ అనుబంధాన్నినెమరువేసుకున్నారు. కళాశాలకు తాము అందిస్తున్న సహకారాన్ని వివరించారు. కెమ్‌దోసా అధ్యక్షుడు ఎ.వరహాలు, కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డా.బి.దేముడు పాల్గొని వారి అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం మెరిట్ విద్యార్థులకు రూ.90 వేలు నగదు ప్రోత్సాహకంగా అందించారు. ప్రస్తుతం చదువుతున్న వారిలో ప్రేరణ కల్పించారు.

'టీడీపీ ఉత్తర కన్వీనర్‌గా 'పొలమరశెట్టి'ను నియమించాలి'

మర్రిపాలెం, ఫిబ్రవరి 17: ఉత్తర నియోజకవర్గ టీడీపీ కన్వీనర్‌గా పార్టీ నాయకుడు, విశాఖ పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి పొల మరశెట్టి శ్రీనివాసరావును నియమించాలని కోరుతూ ఉత్తర నియోజకవర్గంలో పలు వార్డుల అధ్యక్షులు, కార్యదర్శులు తీర్మానం చేశారు. ఈమేరకు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, శ్రీనివాసరావు ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా పార్టీ కోసం అహర్నిశలు పని చేస్తున్నారన్నారు. ఆయన సేవలను గుర్తించి ఉత్తర నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్తగా పార్టీ అధిష్ఠానం సముచితస్థానం కల్పించాల ని వారు కోరారు.

ఈతలపాక సుజాత వినతి

అక్కయ్యపాలెం: ఉత్తర నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా తనను నియమించాలని తెలుగు మాహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ తనను నియమిస్తే పార్టీని బలోపేతం చేసి మరింత ముందుకు తీసుకెళ్తానని చెప్పారు. కార్యకర్తలు, నాయకుల సమన్వయంతో ఎన్నికల్లో టీడీపీ విజయానికి తనవంతు శ్రమిస్తానన్నారు.

మిలాన్ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ

- 21, 22 తేదీల్లో వాహనాల మళ్లింపు
- కొన్ని మార్గాల్లో రాకపోకలపై నిషేధం

మహారాణిపేట, ఫిబ్రవరి 17: విశాఖలోని ప్రతిష్ఠాత్మకమైన మిలాన్- 2024 నిర్వహిస్తున్న సందర్భంగా ఈ నెల 21, 22 తేదీల్లో నగరంలో ట్రాఫిక్ నియంత్రిస్తున్నారు. శనివారం పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీపీ వి.ఎన్. మణికంఠ అందించిన వివరాలివి.. ఈ నెల 21, 22 తేదీల్లో ఉపరాష్ట్రపతి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రులు మిలాన్ నేపథ్యంలో నగరానికి రానున్నారు. అందువల్ల భారీ వాహనాల రాకపోకలు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ , షీలానగర్ నుంచి కాన్వెంట్ జంక్షన్ , కాన్వెంట్ జంక్షన్ నుండి సింధియా వైపు రహదారులపై రాకపోకలను నిషేధించనున్నారు. ఈ సమయంలో తమ వాహనాలను పార్కింగ్ ప్రదేశాలు, తమ యార్డులలో మాత్రమే నిలపాల్సి ఉంటుంది. ఐఎన్ఎస్ శాతవాహన, కృష్ణ, కాకతీయ గేట్ల వద్ద డాక్‌యార్డు ఉద్యోగుల తమ వాహనాలను పార్కింగ్ చేయడానికి వీలులేదు.

బీచ్ రోడ్డులో....

ఈ నెల 20, 22 తేదీలలో నగరంలోని రామకృష్ణా బీచ్ రోడ్డు నుంచి నేవల్ కోస్టల్ బ్యాటరీ వరకు మధ్యాహ్నం ఒంటి నుంచి రాత్రి 8 గంటల వరకు వాహనాల రాకపోకలు నిషేధించారు. పాస్‌లు కలిగిన వాహనదారులు, సమీపంలో నివసిస్తున్న వారు పోలీసుల సూచనలు పాటించాల్సి ఉంది. పాస్‌లు కలిగిన వాహనదారులు ఏపీఐఐసీ గ్రౌండ్‌లో పార్కింగ్ చేయాలి. పాస్‌లులేనివారు తమ వాహనాలను ఎంజీఎం పార్కులోని ఆంధ్రా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో పార్కింగ్ చేసి, కాలినడకన బీచ్‌లోకి చేరుకోవాల్సి ఉంటుంది.


తెలుగుదేశం పార్టీ
గాజు గ్లాసుకే మన ఓటు
VOTE FOR GLASS
శంఖారావం
కదిలిరండి.. తెలుగుదేశం కార్యకర్తలారా
తేది. 18-02-2024 ఆదివారం
వేదిక: ఇందిరా ప్రియదర్శిని
మున్సిపల్ స్టేడియం, విశాఖపట్నం
సమయం :
మధ్యాహ్నం 1.00 గం॥కు
గండి వంశీదీప్
టిడిపి యువనాయకులు
గండి బాబ్జీ
మాజీ శాసనసభ్యులు
విశాఖ దక్షిణ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

రేకుల ఇల్లు దగ్ధం: రూ.10 లక్షల ఆస్తి నష్టం

వేపగుంట, ఫిబ్రవరి 17: జీవీఎంసీ 98వ వార్డు పరిధి అప్పన్నపాలెం పోలిపిల్లి అమ్మవారి గుడి సమీపంలో ఉన్న సిమెంటు రేకుల ఇంట్లో షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. బొట్టా పైడమ్మ అనే మహిళ కూలి పనులు చేస్తూ ఇక్కడ నివసిస్తుంది. ఆమె భర్త మృతి చెందగా, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నాలుగు రోజుల క్రితమే ఒక కుమార్తెకు పెళ్లి చేసింది. వివాహ సర్టిఫికెట్ కోసమని సింహాచలంలోని కల్యాణ మండపానికి శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి వారు వెళ్లారు. ఇంతలోనే తమ ఇల్లు కాలిపోతున్నట్టు తెలియడంతో వారు ఇంటికి వచ్చేసరికే సామాన్లన్నీ అగ్నికి ఆహుతయ్యాయి.

సారె సామగ్రి కొనేందుకు ఉంచిన రూ.మూడు లక్షల నగదు, కట్నానికి సంబంధించిన డబ్బు, 30 తులాల వెండి, కొంత బంగారం కాలి బూడిదైపోయాయని కన్నీరుమున్నీరుగా వారు విలపిస్తున్నారు. ప్రమాద సమయంలో గ్యాస్ సిలిండర్ పేలడంతో ప్రమాద తీవ్రత అధికమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.

ఉత్తరాంధ్రకు పట్టిన దరిద్రం జగన్

... 5వ పేజీ తరువాయి

తీసుకువస్తే జగన్ బూమ్‌బూమ్, ప్రెసిడెంట్ మెడల్ వంటి మద్యం బ్రాండ్లు తీసుకువచ్చారన్నారు.

నవ మోసాలు

ఎన్నికల ముందు నవరత్నాలు అని ఊదరగొట్టిన జగన్, అధికారంలోకి వచ్చిన తరువాత దానిని నవ మోసాలుగా చేశారని లోకేశ్ ధ్వజమెత్తారు. మద్య నిషేధం చేసిన తరువాతే ఓట్లు అడుగుతానని ప్రజలను నమ్మించిన వ్యక్తి...మాట తప్పడమే కాకుండా నేడు వీధివీధినా మద్యం అమ్ముతున్నారన్నారు. ప్రజల కష్టాలు చూసి చంద్రబాబు సూపర్ సిక్స్ ప్రకటించారని గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో టిడ్కో గృహలను లబ్ధిదారులకు అందజేస్తామని ప్రకటించారు. బూత్ స్థాయి అధ్యక్షులు, ముఖ్యమైన నాయకులు రానున్న రెండు నెలల్లో ప్రజల్లోకి వెళ్లి సూపర్ సిక్స్ కోసం ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. సభలో పెందుర్తి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బండారు సత్యనారాయణమూర్తి, జనసేన రూరల్ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడారు. అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి కేడర్‌కు లోకేశ్ సూపర్ సిక్స్ కిట్లు పంపిణీ చేశారు.

నేడు మూడుచోట్ల లోకేశ్ సభలు

ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తూర్పు నియోజకవర్గ పరిధిలోని అప్పుఘర్ వద్ద గల గాదిరాజు ప్యాలెస్ సమీపాన, రెండు గంటలకు విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఏర్పాటుచేసే సభల్లో లోకేశ్ పాల్గొంటారు. అక్కడ నుంచి సాయంత్రం ఐదు గంటలకు విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని గోపాలపట్నం పెట్రోల్ బంకు సమీపాన వెంకటాపురంలో నిర్వహించనున్న సభలో పాల్గొంటారు. ఆదివారం రాత్రి విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని బిర్లా జంక్షన్ సమీపాన గల హోండా షోరూమ్ వద్ద బస చేస్తారు.

ఘనంగా శారదా పీఠం వార్షికోత్సవాలు

పెందుర్తి, ఫిబ్రవరి 17: శారదా పీఠం వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం పీఠం యాగశాలలో మహా రుద్ర సహిత లక్షమూల మంత్ర రాజశ్యామల యాగాన్ని రుత్వికులు ఘనంగా నిర్వహిస్తున్నారు. వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిలను ప్రత్యేకంగా అలంకరించగా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి హారతులిచ్చారు. యాగశాలలో మన్యుసూక్త వనదుర్గ హోమాలు చేయడంతో పాటు చంద్రమౌళీశ్వరులకు పీఠార్చన, పీఠం ప్రాంగణంలోని దేవతామూర్తులకు అభిషేకాలు జరిపారు. టీటీడీ చేపట్టిన వేంకటేశ్వర హవనానికి పీఠాధిపతి హారతులిచ్చారు. సాయంత్రం టీటీడీ పండితులు శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహించారు.

'సింహాద్రి'ని సందర్శించిన కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి

పరవాడ, ఫిబ్రవరి 17: సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి (బొగ్గు మంత్రిత్వ శాఖ) ఎం.నాగరాజు శనివారం సందర్శించారు. ఆయనకు ఓఅండ్‌ఎం విభాగం జీఎం డీపీ పాత్ర స్వాగతం పలికారు. అనంతరం అదనపు కార్యదర్శి ప్లాంట్‌లోని కంట్రోల్ రూమ్, వ్యాగన్, ఫిట్లర్ ఏరియా, యాష్ డైక్ ఏరియా, ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, షీ వాటర్ పంపింగ్ హౌస్‌లను సందర్శించారు. ప్లాంట్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన సముద్రతత అతిథి గృహం ప్రాంతంలో మొక్కలు నాటారు. సంస్థలోని వివిధ విభాగాల జీఎంలు ఎస్.పద్మప్రియా, పి. రాజగోపాలన్, కేజే రావు, హెచ్ఆర్ హెడ్ బీబీ పాత్ర పాల్గొన్నారు.

పంచగ్రామాల భూ సమస్యను గాలికొదిలేసిన జగన్

శంఖారావ సభలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

యోధుడిలా సాగిన లోకేశ్ పాదయాత్ర: జనసేన నేత పంచకర్ల

పెందుర్తి/వేపగుంట, ఫిబ్రవరి 17: సింహాచల దేవస్థాన పరిధిలోని పంచగ్రామాల భూ సమస్యను సీఎం జగన్ గాలికొదిలేశారని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి విమర్శించారు. పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని కృష్ణరాయపురం ఎగ్జిబిషన్ మైదానంలో జరిగిన లోకేశ్ శంఖారావం సభలో ఆయన టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని, వైసీపీ ప్రభుత్వ పాలనలో కుంటుబడిన అభివృద్ధి గురించి గణాంకాలతో వివరించారు. పంచగ్రామాల భూ సమస్య కోసం టీడీపీ ప్రభుత్వం జీవో-578 తేవడంతో తొమ్మిది వేల ఇళ్ల క్రమబద్ధీకరణ చేయడం జరిగిందన్నారు. అయితే దివంగత వైఎస్ సీఎం అయ్యాక టీడీపీ జీవోను రద్దు చేశారని ఆరోపించారు. 2014లో మళ్లీ టీడీపీ ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారం కోసం శాసన సభలో చట్టం చేసి మరో జీవో తెస్తే.. జగన్ న్యాయవాదులచే కోర్టు నుంచి స్టే తెచ్చి అడ్డుకున్నారని మండిపడ్డారు. అలాగే ముదపాకలో రైతుల నుంచి జరిపిన ల్యాండ్ పూలింగ్‌లో భారీ అవినీతికి వైసీపీ నేతలు పాల్పడ్డారని బండారు ఆరోపించారు. వంగలిలో పెట్రో యూనివర్సిటీ అమలుకు నోచుకోలేదని, పరవాడ మండలంలోని


శంఖారావ సభలో మాట్లాడుతున్న బండారు, పంచకర్ల


లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

కాలుష్య గ్రామం తాడి తరలింపునకు నోచుకోలేదన్నారు. వేపగుంటలో వుడా ఆధీనంలో ఉన్న 150 ఎకరాల భూ సమస్యను పరిష్కరించాలని లోకేశ్‌ను కోరారు. కాగా స్థానిక ఎమ్మెల్యే బిల్డప్ బాబాయ్ అని, ఆయన చేసేదంతా అవినీతేనని బండారు విమర్శించారు. రాంపురంలో వీర్రాజు చెరువుకు తప్పుడు పత్రాలతో సృష్టించి ఆక్రమించారని, ఇక్కడ పని చేసిన ముగ్గురు తహసీల్దార్ల అవినీతి గురించి రెడ్ బుక్‌లో నోటు చేసుకోవాలని లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు.

దోచుకోవడం..దాచుకోవడమే వైసీపీ నైజం

గతంలో ఎంతోమంది రాజకీయ నాయకులు పాదయాత్ర చేసినప్పుడు అప్పటి ప్రభుత్వాలు సహకరించాయని, కానీ లోకేశ్ పాదయాత్రకు అడుగడుగునా వైసీపీ ప్రభుత్వం అడ్డంకులను సృష్టించినా ఆయన యోధుడిలా ముందుకు సాగారని జనసేన పార్టీ విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. తాను చేపట్టిన పాదయాత్ర ద్వారా లోకేశ్ పరిణితి చెందిన నాయకునిగా ఉద్భవించారన్నారు. దోచుకోవడం.. దాచుకోవడం అన్న రీతిలో జగన్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని విమర్శించారు. వైసీపీ అరాచకాలకు చరమగీతం పాడాలంటే టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. పెందుర్తి నియోజకవర్గంలో టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప కొత్తగా ఏమీ జరగలేదన్నారు.

లోకేశ్‌కు కార్పొరేటర్ల వినతి

సింహాచల పంచగ్రామాల భూ సమస్య, వేపగుంటలోని వుడా భూములు, తదితర సమస్యలపై దృష్టి సారించాలని కోరుతూ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్, కార్పొరేటర్లు రాపర్తి కన్నా, బల్ల శ్రీనివాసరావు, సేనాపతి వసంత శంకరరావులు లోకేశ్‌కు వినతిపత్రం అందజేశారు.

గాజువాక శంఖారావ సభను విజయవంతం చేయాలి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, ఫిబ్రవరి 17: ఇక్కడి లంకా మైదానంలో ఈ నెల 19న తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టనున్న శంఖారావ సభను విజయవంతం చేయవలసిందిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కోరారు. జనసేన కార్యాలయానికి శనివారం ఆయన వెళ్లి ఈ సభకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు, జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు మాట్లాడుతూ దగా పడిన రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు పోరాటాలు తప్పవని, రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. సీఎం జగన్ చేస్తున్న అరాచక పాలనకు చరమగీతం పాడాలంటే టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, నాయకులు పులి వెంకటరమణారెడ్డి, బలగ బాలునాయుడు, పప్పు శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.


ఐక్యతను చాటుతున్న పల్లా శ్రీనివాసరావు, కోన తాతారావు, తదితరులు

సభా స్థలిలో ఏర్పాట్లు పరిశీలన

శంఖారావ సభ నిమిత్తం లంకా మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను పల్లా శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు పరిశీలించారు. ఈ సభకు అధిక సంఖ్యలో ప్రజలు రానున్నందున ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని, సభను విజయవంతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బొండా జగన్, నల్లూరు సూర్యనారాయణ, పల్లా శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

అధిక సంఖ్యలో తరలిరావాలి

కూర్మన్నపాలెం: ఈ నెల 19న గాజువాక లంకా గ్రౌండ్స్‌లో జరగనున్న లోకేశ్ శంకారావ సభను సక్సెస్ చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ విజ్ఞప్తి చేశారు. 87వ వార్డు వడ్లపూడిలోని టీడీపీ కార్యాలయం వద్ద శనివారం రాత్రి జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలుకుతామన్న సందేశాన్ని వైసీపీకి ఇచ్చేలా అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు ఈ సభకు హాజరవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల ప్రచారం

గోపాలపట్నం: స్థానిక బంక్ కూడలిలోని సంత ప్రాంగణం సమీపంలో ఆదివారం సాయంత్రం జరగనున్న నారా లోకేశ్ శంఖారావ సభను సక్సెస్ చేయాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేశారు. ఇప్పటికే ప్రధాన రహదారిలో పార్టీ జెండాలు, ఫ్లెక్సీలను అధికంగా ఏర్పాటు చేశారు. గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో టీడీపీ వార్డు కమిటీ సభ్యులు సభకు తరలిరావాలంటూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం సాగించారు. పురవీధుల్లో కరపత్రాలను పంపిణీ చేస్తూ అందరినీ సభకు ఆహ్వానించారు.



ఎక్స్‌కవేటర్‌తో రహదారిని తొలగిస్తున్న దృశ్యం

పంట కాలువలో నుంచి వేసిన రహదారి తొలగింపు

పరవాడ, ఫిబ్రవరి 17: భరిణికం రెవెన్యూ పరిధి సర్వే నంబర్-180, 181లలో గల ప్రధాన పంట కాలువను పూడ్చి ఏర్పాటు చేసిన రహదారిని రెవెన్యూ అధికారులు శనివారం ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు. గ్రామానికి చెందిన ముగ్గురు వైసీపీ నాయకులు సొంత భూముల రోడ్డు కోసం పంట కాలువ పూడ్చివేసిన వైనంపై 'వైసీపీ నేతల బరితెగింపు' శీర్షికతో ఈ నెల 14న 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై జేసీ ఆదేశాల మేరకు పరవాడ తహసీల్దార్ గణపతిరావు పర్యవేక్షణలో రోడ్డు తొలగింపు పనులు చేపట్టారు. పోలీస్ సిబ్బంది పర్యవేక్షణలో పనులను ప్రారంభించారు. సుమారు అర కిలోమీటరు మేర పంట కాలువను పూడ్చివేసి రహదారిని ఏర్పాటు చేయడంతో పూర్తిస్థాయిలో రహదారిని తొలగించాలని భావించారు. ఇందుకోసం ఉద యం పది గంటలకు పనులు ప్రారంభించి సాయంత్రం నాలుగు గంటల వరకు చేపట్టారు. ఆర్ఐ గఫూర్, వీఆర్వోలు బి.శ్రీనివాసరావు, టి.వెంకటేశ్వరరావు, రాము, నాగరాజు పాల్గొన్నారు.

'తెలుగును గౌరవిస్తూనే ఆంగ్లం నేర్చుకోండి'

మల్కాపురం, ఫిబ్రవరి 17: తెలుగు భాషను గౌరవిస్తూనే ఆంగ్లం నేర్చుకోవడం ఎంతో అవసరమని వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. మేధా చిరంజీవి ఆధ్వర్యంలో షీలానగర్‌లోని విశాఖ డెయిరీ స్కూల్ ఆడిటోరియంలో వలంటీర్లకు నిర్వహించే ఈజీ ఇంగ్లీష్-ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొద్ది రోజుల క్రితం పారిశ్రామిక ప్రాంతంలో నిర్వహించిన జాబ్ మేళాలో పలువురు నిరుద్యోగ యువత ఇంగ్లీష్ రాక ఉద్యోగాలు పొందలేకపోయారని, అందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గలవారు 9000818467, 9000938467 సెల్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు మిలినీయం శ్రీధర్‌రెడ్డి, వైసీపీ పశ్చిమ పరిశీలకుడు రెహమాన్, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

మావి జిరాయితీ భూములేనంటూ ఏఈకి రైతుల వినతి

సబ్బవరం, ఫిబ్రవరి 17: మండలంలోని మొగలిపురం సర్వే నంబర్-43లో 6.90 ఎకరాల పక్కా జిరాయితీ భూములంటూ సుమారు 30 మంది రైతులు శనివారం ఇరిగేషన్ ఏఈ రామలక్ష్మణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 16న 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రకృతి విధ్వంసం' కథనం ప్రచురితమైన నేపథ్యంలో వారు ఏఈని కలిసి తాతలు, తండ్రుల కాలం నుంచి సదరు జిరాయితీ భూములను పంచుకోలేదన్నారు. వ్యవసాయ కూలీ రేట్లు పెరగడం వల్ల కొన్నేళ్లుగా వ్యవసాయం చేయడం లేదన్నారు. ఇటీవల సదరు భూములను పంచుకుని చదును చేసుకోవడం జరుగుతుందన్నారు. రీ-సర్వేలో కూడా తమ హక్కు పత్రాలు (ఎఫ్ఎంబీ) చూపించి, రెవెన్యూ రికార్డుల్లో తమ పేర్లు నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. సర్వే నంబర్-29, 45ల్లో గెడ్డ వాగుల నుంచి నీరు లాలంవారి చెరువుకు వెళ్తుందే తప్ప తమ పొలాల్లోకి రాదన్నారు. అందువల్ల సమగ్ర దర్యాప్తు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు గండి అప్పలనాయుడు, కె.దేముడు, జీకే నాయుడు, జి.దేముడుబాబు, బండయ్య, రమణ, బాలు, తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మంపై విద్యార్థులకు అవగాహన

అగనంపూడి, ఫిబ్రవరి 17: స్థానిక గొన్నవానిపాలెంలోని గొన్నా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సనాతన ధర్మంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమం నుంచి స్వామి శ్వసం వైద్యానంద ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మానికి మన నిత్య జీవితంలో ఎంత ప్రాముఖ్యత ఉందో వివరించారు. కార్యక్రమంలో గొన్నా విద్యా సంస్థల కార్యదర్శి గొన్నా హేమచంద్‌నాయుడు, ప్రిన్సిపాల్ పీఎస్ఎన్. మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ రమణయ్య బంధువు రాజేంద్ర మృతి

... 5వ పేజీ తరువాయి

తరలించారు. ఇదిలావుండగా తహసీల్దార్ బంధువుగా చెప్పుకుంటున్న ప్రధాన రాజేంద్ర శుక్రవారం మృతిచెందడం చర్చనీయాంశంగా మారింది. పోలీసులు, ప్రసాద్, తదితరుల ఒత్తిళ్లను తట్టుకోలేకే రాజేంద్ర మృతిచెందాడంటూ ప్రచారం జరిగింది. అయితే రాజేంద్ర భార్య త్రివేణి మాత్రం తన భర్తకు గుండెపోటు రావడం వల్లే మృతిచెందారని, ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదని స్పష్టంచేశారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కోటపాటు కొత్తూరుకు చెందిన ప్రధాన రాజేంద్ర పదేళ్ల కిందట విశాఖ వచ్చి ఎంవీపీకాలనీలోని గాదిరాజు ఎంపైర్స్‌లో కుటుంబంతో ఉంటున్నారు. భార్య త్రివేణితోపాటు ఏడేళ్ల కుమార్తె ఉంది. రాజేంద్ర కొంతకాలం కిందటి వరకూ అనకాపల్లిలో మహీంద్ర ట్రాక్టర్ల షోరూమ్ నిర్వహించేవారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కొనసాగుతున్నారు. కాగా త్రివేణి కథనం ప్రకారం...మధుమేహం కలిగి ఉన్న రాజేంద్ర శుక్రవారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఒక్కసారిగా షుగర్ లెవెల్స్ పెరిగిపోవడంతో కుప్పకూలిపోయారు. వెంటనే షీలానగర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించామని, అక్కడ చికిత్స పొందుతూ రాత్రి పది గంటల సమయంలో మృతిచెందారు. కార్డియాక్ అరెస్టు వల్లే రాజేంద్ర మృతిచెందినట్టు వైద్యులు కూడా నిర్ధారించారన్నారు. తన భర్త అంత్యక్రియలు కూడా పూర్తయినందున ఆ విషయాన్ని అక్కడితో వదిలేయాలని ఆమె కోరారు. తన భర్త మృతి చెందడంతో ఏడేళ్ల కుమార్తెతో ఎలా బతకాలో తెలియని స్థితిలో ఉన్న తమను కొన్ని టీవీ ఛానల్స్ తప్పుడు వార్తలు ప్రసారం చేసి మనోవేదనకు గురిచేస్తున్నారని వాపోయారు. ఏదైనా లేనిపోని అనుమానాలతో కథనాలు ప్రసారం చేస్తే ఆయా మీడియా సంస్థల పేరు చెప్పి తన కుమార్తెతో కలిసి ఆత్మహత్య చేసుకోవడం ఒక్కటే తనకు మార్గమని త్రివేణి ఆవేదన వెళ్లగక్కారు.

ఆర్థిక రాజధానిగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నాడని దుయ్యబట్టారు. తాము విశాఖను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేయడంతోపాటు ఫ్లై ఓవర్‌లు, అండర్ బ్రిడ్జిలు నిర్మించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. మెడికల్ డివైస్ తయారీ హబ్‌గా, ఐటీ కేంద్రంగా విశాఖను తీర్చిదిద్దుతామని లోకేష్ స్పష్టంచేశారు. ఏటా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని, ఉద్యోగం వచ్చేంత వరకు మూడు వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామని నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. భీమిలి నియోజకవర్గంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, 2019 ఎన్నికల్లో తనను ఇక్కడి నుంచి పోటీ చేయాల్సిందిగా చంద్రబాబు చెప్పారన్నారు. కానీ, ఇప్పటివరకు టీడీపీ గెలవని స్థానాన్ని కోరి మరీ మంగళగిరి నుంచి తాను పోటీ చేశానని, స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యానన్నారు. భీమిలి నుంచి పోటీ చేస్తే తనతోపాటు భరత్ కూడా నెగ్గేవాడని, ఆ మాట ఇప్పటికీ భరత్ చెబుతుంటాడన్నారు. భవిష్యత్తులో కూడా భీమిలిని అభివృద్ధి చేసే బాధ్యతను తాము తీసుకుంటామని స్పష్టం చేశారు.

2014 నుంచి 2019 వరకు ఇక్కడ వేయి కోట్ల అభివృద్ధి పనులు చేశామని, ఇండోర్ స్టేడియం, మిలీనియం టవర్ ఏర్పాటుచేయడంతోపాటు టిడ్కో ఇళ్లను నిర్మించామన్నారు. 2019లో భీమిలి నియోజకవర్గ ప్రజలు పాలిచ్చే ఆవును కాదని, తన్నే దున్నపోతును గెలిపించుకున్నారన్నారు. అర గంట అవంతి మంత్రిగా పనిచేసినా ఇక్కడి అభివృద్ధి పనులు చేయలేదని, ప్రజల జీవితాల్లో మార్పులు రాలేదన్నారు. ఆయనకు రాసలీలలు మాత్రమే తెలుసునని ఎద్దేవా చేశారు. ఆయన వ్యవహారాన్ని చూడలేక ఇక్కడి ప్రజలు తలదించుకునే పరిస్థితి దాపురించిందన్నారు. వైసీపీ నాయకులు అవినీతికి కేరాఫ్‌గా భీమిలిని మార్చారని, రాష్ట్రంలోని నాయకులంతా ఇక్కడి భూములపై పడ్డారని ఆరోపించారు. ఈ ప్రాంతానికి చెందిన రూ.2500 కోట్ల విలువైన భూములను వైకాపా నాయకులు దోచుకున్నారన్నారు. అరగంట అవంతి అవినీతి పెరిగిపోయిందని, అనేక పోస్టులు అమ్ముకున్నాడని, జూట్ ఫ్యాక్టరీ నుంచి డబ్బులు తీసుకుని కార్మికులకు న్యాయం చేయలేదని ఆరోపించారు. తనకు అక్కా, చెల్లెళ్లు, అన్నదమ్ములు లేరని, 60 లక్షల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలే తనకు అక్క, చెల్లెళ్లు, అన్నదమ్ములన్నారు. టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి కృషి: ఎమ్మెల్యే

సబ్బవరం, ఫిబ్రవరి 17: మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. సీఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.సూర్యకుమారి, వైసీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబు, ఎంపీటీసీ దేముడు బాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు శేషుబాబు, నాయకులు సురేశ్‌రాజ్, కొటాన రాము, తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక వ్యతిరేక విధానాలను వీడాలి'

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 17: కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విడనాడాలని ఇంటక్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. శనివారం ప్లాంట్‌లో జరిగిన మావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్‌లకు అప్పగించడం, కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేయడం, ఇలా అన్నివిధాల అన్యాయం చేస్తుందన్నారు. కార్మికులకు వేతన సవరణ చేయకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీఎంకే నాయక్, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఏ నాయుడు, కొమ్ము ప్రసాద్, డి.మోహన్, ఎ.నూకరాజు, బీటీ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

కారు బీభత్సం

... 5వ పేజీ తరువాయి

వచ్చి డ్రైవర్‌ను తనతో తీసుకువెళ్లేందుకు యత్నించాడు. పోలీసులు అడ్డుకోవడంతో వారితో వాగ్వాదానికి దిగాడు.

మద్యం మత్తులోనే...?

కారు డ్రైవర్ అలజంగి గణేష్ మత్తుగా ఉండడంతో పాటు ఏమి జరిగిందో తెలియని స్థితిలో ఉండడాన్ని స్థానికులు గమనించారు. అతడు మద్యం సేవించి ఉన్నాడని చెబుతున్నారు. ప్రమాదం జరిగాక అతడిని స్థానికులు విచారించగా తనది పెదవాల్తేరని, పెళ్లిలో కారు నడిపేందుకు ఆఫ్టింగ్ డ్రైవర్‌గా వచ్చానన్నాడు. రాత్రంతా మద్యం సేవించానని వివరించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ ఎస్ఐలు బి.తిరుపతిరావు, వి.కనకారావు, ఏఎస్ఐ ప్రసాద్ వివరాలను సేకరించారు. గాయపడిన లక్ష్మణ్, డ్రైవర్ గణేష్‌లను ఆస్పత్రికి తరలించారు. జగదీశ్వరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురికి తరలించారు.

తల్లడిల్లిన తనయుడు

నక్కవానిపాలెం రామాలయం వీధికి చెందిన జగదీశ్వరి అలియాస్ జగదీ కూలీ. ఆమె భర్త పదేళ్ల కిందటే అనారోగ్యంతో మృతి చెందాడు.

కుమారుడు పోలిశెట్టి గణేష్‌తో కలిసి జీవిస్తోంది. తన రెక్కల కష్టంతో అతడిని ఇంటర్ చదివిస్తోంది. ప్రమాదంలో తల్లి మృత్యువాత పడడంతో కుమారుడు గణేష్ భోరున విలపిస్తున్నాడు. ఉన్న ఒక్కగానొక్క ఆధారం తిరిగిరాని లోకాలకు తరలిపోయిందని, ఈ లోకంలో తనకంటూ ఇంకెవరూ లేరని, ఎలా బతకాలని, ఎవరు చదివిస్తారని వెక్కివెక్కి ఏడుస్తున్న అతడిని ఓదార్చడం ఎవరితరం కావడం లేదు.

డ్రైవర్‌కు ఫిట్స్?

ఆఫ్టింగ్ డ్రైవర్‌గా వచ్చిన గణేష్‌కు కారు నడుపుతుండగా ఫిట్స్ రావడంతోనే ప్రమాదం జరిగిందని కారు యజమాని చెబుతున్నాడు. అయితే కేసు తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిట్స్ వస్తే కారును అంతదూరం ఎలా నడిపాడని, ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్‌ను కారులోనుంచి తామే బయటకు తీశామని, అప్పుడు మామూలుగానే ఉన్నాడంటున్నారు. ఫిట్స్ వస్తే నోటిలో నురగలు కూడా వస్తాయని, కేసు నుంచి తప్పించేందుకే యజమానితప్పుడు సమాచారం ఇస్తున్నాడని చెబుతున్నారు.

మాతంగీశ్వరీ అవతారంలో దర్శనమిచ్చిన శ్యామా అమ్మవారు

సబ్బవరం, ఫిబ్రవరి 17: మండలంలోని దేవీపురంలో శ్యామా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు మాతంగీశ్వరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గురుపత్ని అన్నపూర్ణమ్మ, శ్రీవిద్య ట్రస్టు నిర్వాహకులు కె.ప్రభాకర్, రమ, తదితరులు పాల్గొన్నారు.


తెలుగుదేశం పార్టీ
VOTE FOR GLASS
శంఖారావం
కదిలిరండి.. తెలుగుదేశం కార్యకర్తలారా
తేది. 18-02-2024 ఆదివారం
వేదిక: ఇందిరా ప్రియదర్శిని
మున్సిపల్ స్టేడియం, విశాఖపట్నం
సమయం :
మధ్యాహ్నం 1.00 గంుకు
గండి బాబ్జీ
మాజీ శాసనసభ్యులు
విశాఖ దక్షిణ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్
గండి వంశీదీప్
టిడిపి యువనాయకులు

కేన్సర్ నిరోధక ఉచిత వ్యాక్సిన్



వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ షరీన్ రహమాన్

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 17: గర్భకోశ ముఖ ద్వార కేన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలని చైతన్య స్రవంతి సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షరీన్ రహమాన్ పేర్కొన్నారు. శనివారం ఏవీఎస్‌కాలేజీ వద్ద కమ్యూనిటీ హాల్‌లో 9 నుంచి 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా సెర్వైకల్ క్యాడ్రీ వ్యాలెంట్ వ్యాక్సిన్‌ను వేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భకోశ ముఖద్వార ముఖద్వారా కేన్సర్ నియంత్రణకు వ్యాక్సిన్ ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఉచితంగా వ్యాక్సిన్లు అందిస్తున్నామన్నారు. తొలి విడత 50 మంది బాలికలకు వేసినట్టు తెలిపారు ఒక డోస్ వ్యాక్సిన్‌కు బయట రెండు వేల వరకు ఖర్చవుతుందన్నారు. రెండో డోసును ఆరు నెలల తర్వాత అందిస్తామన్నారు. కేజీహెచ్ అంకాలజీ విభాగధిపతి డాక్టర్ పాండురంగకుమారి మాట్లాడుతూ ఈవ్యాక్సిన్ 80 శాతం మందికి రక్షణగా నిలుస్తుందన్నారు. వివాహం తర్వాత కూడ వ్యాక్సిన్ డోస్‌లు వేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వ్యాక్సిన్ సరఫరా సంస్థ ఏరియా మేనేజర్ రాంప్రసాద్, చైతన్య స్రవంతి ప్రతినిధులు రకియాబాయి, విజయ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న అధ్యక్షుడు చంద్రమౌళి

మురళీనగర్, ఫిబ్రవరి 17 ; మురళీనగర్ వాకర్స్ క్లబ్ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి తెలిపారు.. శనివారం క్లబ్ వేదిక వద్ద కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిపిన సభ్యత్వ నమోదు ద్వారా రూ. 50 వేలు సమకూరినట్లు తెలిపారు. ఈనెల 21న ప్రపంచ మాతృభాషా దినోత్సవం నిర్వహణ, మార్చి 8న మహిళా దినోత్సవం, వైద్య శిబిరాలు తదితర సామాజిక కార్యక్రమాల్ని చేపట్టనున్నట్లు సభ్యులకు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి వాకర్ కూర్మారావు, సెక్రటరీ పి.చెల్వరాజు, పూర్వ అధ్యక్షులు, ప్రత్యేక ఆహ్వానితులు మాట్లాడారు. వాకర్స్ క్లబ్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

యూసీసీ టి-20 క్రికెట్ పోటీలు



సాత్విక్‌కు అవార్డు అందిస్తున్న రమాకాంత్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 17: వాల్తేరు రైల్వే స్టేడియంలో జరుగుతున్న యూసీసీ టీ 20 క్రికెట్ చాంపియన్‌షిప్ టోర్నీలో కవలియర్స్ సీసీ, గెలాక్సీ సీసీ జట్లు ఫైనల్స్‌కు చేరాయి. శనివారం జరిగిన తొలి సెమీస్‌లో కవలియర్స్ సీసీ ఏడు వికెట్ల తేడాతో మెట్రో సీసీపై విజయం సాధించింది.ఆల్‌రౌండర్ వరుణ్ సాత్విక్‌కు ప్లెయిర్ ఆఫ్ మ్యాచ్ అవార్డును యూసీసీ ప్రతినిధి రమాకాంత్ అందించారు.

లోకేశ్ శంఖారావానికి సర్వం సిద్ధం

- ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సభ
- విజయవంతం చేయాలి: టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ

మహారాణిపేట, ఫిబ్రవరి 17: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం నిర్వహించనున్న నిర్వహించనున్న శంఖారావం సభను విజయవంతం చేయాలని సౌత్ ఇన్‌చార్జీ గండి బాబ్జీ కోరారు . శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, లోకేశ్ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు మున్సిపల్ స్టేడియంలో సభ ప్రారంభం కానుందన్నారు.నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విచ్చేసి సభను విజయవంతం చేయాలని కోరారు. లోకేశ్ యువగళం పాదయాత్రలో వెళ్లని నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారన్నారు. లోకేశ్ సభలకు జనంనుంచి విశేష స్పందన వస్తుందని తెలిపారు. అలాగే, యాత్ర సినిమాకు ఆదరణ కరువైందని.. రాజధాని సినిమాపై ప్రేక్షకులు విశేష ఆదరణ చూపుతున్నారు. ఈ సినిమాలో జగన్ మోసాలను తెలుసుకుంటున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జగన్ గద్దెదిగడం ఖాయమని అన్నారు. అలాగే, ఇందిరా గాంధీ స్టేడియంలో ఆదివారం మధ్యాహ్నం యువనేత నారా లోకేశ్ నిర్వహించనున్న శంఖారావం సభ ఏర్పాట్లను శనివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ నజీర్‌తోపాటు నాయకులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. దక్షిణ నియోజకవర్గ ప్రజలు వచ్చి సభ విజయవంతం చేయాలని కోరారు.

సభను ప్రజలు పెద్ద సంఖ్యలో రావాలి



స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న గండి బాబ్జీ, నాయకులు

డాబాగార్డెన్స్: నారా లోకేశ్ శంఖారావం కార్యక్రమానికి 31వ వార్డు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి వానపల్లి గాయత్రిఫణికుమారి పిలుపునిచ్చారు.శనివారం వార్డు కార్యాలయంలో ఇన్‌చార్జి గండిబాబ్జీ ఆదేశాల మేరకు సమావేశమయ్యారు. ఆదివారం 12.30 గంటలకు ప్రారంభంకానున్న ఈ సభకు ప్రజలను అధిక సంఖ్యలో తరలించాలని కోరారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి రావడమే ధ్యేయంగా ప్రతీ ఒక్కరూ పనిచేయాలని కోరారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు సారిపల్లి మహేష్, నాని, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యం కల్పించే పార్టీకే మద్దతు

- ఉత్తరాంధ్ర తూర్పు కాపు సంఘం అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు



సంఘీ భావం తెలుపుతున్న నాయకులు

మహారాణిపేట, ఫిబ్రవరి 17: ఉత్తరాంధ్ర జిల్లాలో అత్యధికంగా ఉన్న తూర్పు కాపులకు తగిన స్థాయిలో అసెంబ్లీ, పార్లమెంట్ టికెట్లు కేటాయించాలని ఉత్తరాంధ్ర తూర్పు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసనాయుడు వివిధ పార్టీలను డిమాండ్ చేశారు. శనివారం జడ్పీ జంక్షన్ వద్ద ఓ సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపుల పేరుతో తూర్పు కాపులకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. ఉత్తరాంధ్రలో తూర్పు కాపులు 30 లక్షల మందికి పైగా ఉన్నారన్నారు. జనాభా దామాషా ప్రకారం ఉమ్మడి శ్రీకాకుళం విజయనగరం, విశాఖ జిల్లాలో అధిక టికెట్లు కేటాయించాలన్నారు. కానున్న రోజులలో వలస నాయకులు వద్దు- స్థానిక నాయకులు ముద్దు అనే నినాదంతో ముందుకు వెళ్తామన్నారు. తూర్పు కాపులకు సీట్లు ఇచ్చే పార్టీలకు అండగా ఉంటామన్నారు. ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర గౌరవ అధ్యక్షుడు లంకా మోహనరావు , బి సుధాకర్, గణేష్, రెడ్డి వెంకటరమణ, కల్యాణ గోపి, అసిరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేద వర్గాల సేవే రోటరీ క్లబ్ లక్ష్యం

- రోటరీ గవర్నర్ దత్త సుబ్బారావు



సేవలను వివరిస్తున్న రోటరీ గవర్నర్ దత్తా సుబ్బారావు

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 17: పేద వర్గాల సేవే లక్ష్యంగా రోటరీ క్లబ్ పనిచేస్తోందని రోటరీ గవర్నర్ దత్త సుబ్బారావు తెలిపారు. శనివారం నగరం విశాఖ పోర్టు సిటీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రోటరీ ద్వారా పోలియో 99.9 శాతం నిర్మూలించినట్టు చెప్పారు. విశాఖ పోర్టు సిటీ పోలియో నిర్మూలనకు రూ. 2 లక్షలు, రోటరీ ఫౌండేషన్ కోసం మరో రూ. 3.50 లక్షల విరాళం అందించడంపై ఆయన అభినందనలు తెలిపారు. రోటరీ విశాఖ పోర్టుసిటీ నగరంలోని ప్రభుత్వ బాలిక హాస్టల్స్, జువైనల్ హోమ్స్‌లకు ఉచితంగా పరుపులు అందించినట్టు చెప్పారు. కుట్టుమిషన్లు, బాలికల అంధుల పాఠశాలకు ఫర్నీచర్ చేకూర్చామని, బాలికలకు స్కాలర్ షిప్‌లనందిస్తున్నట్టు పేర్కొన్నారు. పెదవాల్తేరు కంటి ఆసుపత్రి వద్ద రోటరీ డయాగ్నస్టిక్ సెంటర్ ద్వారా తక్కువ ధరకు ఆరోగ్య పరీక్షలందిస్తున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో రోటరీ జిల్లా గవర్నర్ జి.విశ్వనాథ్, పూర్వఅధ్యక్షుడు జీఎస్‌రాజు, కార్యదర్శి ఎస్ఎస్ఎన్ రాజు, కోశాధికారి కె.వి.రమణ, రోటేరియన్లు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయమైన కోర్కెలను వెంటనే పరిష్కరించాలి

- ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ ఈశ్వరరావు



నల్లబాడ్జీలు ధరించి ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

మహారాణిపేట, ఫిబ్రవరి 17: ఉద్యోగుల బకాయిలను చెల్లించడంతో న్యాయమైన కోర్కెలను వెంటనే పరిష్కరించాలని అమరావతి జేఏసీ విశాఖ జిల్లా చైర్మన్ కె. ఈశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ ఉద్యమ కార్యచరణలో భాగంగా శనివారం కలెక్టరేట్ జంక్షన్‌లోని ఎన్‌జీవో భవన్‌లో ఆవరణలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లుగా ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రివర్స్ పీఆర్‌సీ, సంవత్సరాల తరబడి సరండర్‌లీవ్‌లు ఎగవేస్తోందన్నారు. దాచుకున్న డబ్బు కూడా ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కోరారు ఈ సమావేశంలో ఉద్యోగ నాయకులు రొంగలి రవిశంకర్ కె శ్రీనివాసరావు, డీడీ ప్రసాదరావు , దాసరి నాగేశ్వరరావు, దశరధరామి రెడ్డి, ఎస్ సత్తిబాబు, ఎన్ చంద్ర శేఖర్, పి.అప్పలరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అయోధ్య పాదుకలతో రథయాత్ర



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సీతంపేట, ఫిబ్రవరి 17: రామనామంతో సీతంపేటవీధులు మార్మోగాయి. రాధాకృష్ణ మందిరం నుంచి ప్రధాన కూడలిలోని దుర్గాగణపతి ఆలయం వరకు అయోధ్యరాముని పాదుకలను రథంపై ఊరేగించారు. వార్డు కార్పొరేటర్ మాజీ జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు సారిపిల్లి గోవింద్ ఆర్థిక సహాయంతో ఈ యాత్రను సీతంపేట షిరిడీ సాయిబాబా భజన మండల్, సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ యాత్రను కార్పొరేటర్ గోవింద్ జెండా ఊపి ప్రారంభించారు. భక్తులు సారిపిల్లి గంగరాజు, బోర వెంకట రమణ, నమ్మి వెంకట్, సన్నీ, గుడివాడ గౌరీ నాయుడు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై అవగాహన

మహారాణిపేట, ఫిబ్రవరి 17: విదేశాలలో విద్యను అభ్యసించాలనుకునే వారికి నిపుణులతో అవగాహన శిక్షణ అందించనున్నట్లు యూనీ సంస్థ మేనేజర్ కె. అనిత తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మా ట్లాడారు. ఈ నెల 19వ తేదీన ఆస్ట్రేలియా ఆడిషన్సు డే నిర్వహిస్తున్నామన్నారు. పదికి పైగా ఆస్ట్రేలియా యూనివర్సిటీలు ఆరోజు పాల్గొంటున్నాయన్నారు. విద్యార్థుల అర్హత ప్రకారం అవకాశాలు లభిస్తాయన్నారు.

ఆర్థిక రాజధానిగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నాడని దుయ్యబట్టారు. తాము విశాఖను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేయడంతోపాటు ఫ్లై ఓవర్‌లు, అండర్ బ్రిడ్జిలు నిర్మించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. మెడికల్ డివైస్ తయారీ హబ్‌గా, ఐటీ కేంద్రంగా విశాఖను తీర్చిదిద్దుతామని లోకేష్ స్పష్టంచేశారు. ఏటా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని, ఉద్యోగం వచ్చేంత వరకు మూడు వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామని నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. భీమిలి నియోజకవర్గంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, 2019 ఎన్నికల్లో తనను ఇక్కడి నుంచి పోటీ చేయాల్సిందిగా చంద్రబాబు చెప్పారన్నారు. కానీ, ఇప్పటివరకు టీడీపీ గెలవని స్థానాన్ని కోరి మరీ మంగళగిరి నుంచి తాను పోటీ చేశానని, స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యానన్నారు. భీమిలి నుంచి పోటీ చేస్తే తనతోపాటు భరత్ కూడా నెగ్గేవాడని, ఆ మాట ఇప్పటికీ భరత్ చెబుతుంటాడన్నారు. భవిష్యత్తులో కూడా భీమిలిని అభివృద్ధి చేసే బాధ్యతను తాము తీసుకుంటామని స్పష్టం చేశారు.

2014 నుంచి 2019 వరకు ఇక్కడ వేయి కోట్ల అభివృద్ధి పనులు చేశామని, ఇండోర్ స్టేడియం, మిలీనియం టవర్ ఏర్పాటుచేయడంతోపాటు టిడ్కో ఇళ్లను నిర్మించామన్నారు. 2019లో భీమిలి నియోజకవర్గ ప్రజలు పాలిచ్చే ఆవును కాదని, తన్నే దున్నపోతును గెలిపించుకున్నారన్నారు. అర గంట అవంతి మంత్రిగా పనిచేసినా ఇక్కడి అభివృద్ధి పనులు చేయలేదని, ప్రజల జీవితాల్లో మార్పులు రాలేదన్నారు. ఆయనకు రాసలీలలు మాత్రమే తెలుసునని ఎద్దేవా చేశారు. ఆయన వ్యవహారాన్ని చూడలేక ఇక్కడి ప్రజలు తలదించుకునే పరిస్థితి దాపురించిందన్నారు. వైసీపీ నాయకులు అవినీతికి కేరాఫ్‌గా భీమిలిని మార్చారని, రాష్ట్రంలోని నాయకులంతా ఇక్కడి భూములపై పడ్డారని ఆరోపించారు. ఈ ప్రాంతానికి చెందిన రూ.2500 కోట్ల విలువైన భూములను వైకాపా నాయకులు దోచుకున్నారన్నారు. అరగంట అవంతి అవినీతి పెరిగిపోయిందని, అనేక పోస్టులు అమ్ముకున్నాడని, జూట్ ఫ్యాక్టరీ నుంచి డబ్బులు తీసుకుని కార్మికులకు న్యాయం చేయలేదని ఆరోపించారు. తనకు అక్కా, చెల్లెళ్లు, అన్నదమ్ములు లేరని, 60 లక్షల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలే తనకు అక్క, చెల్లెళ్లు, అన్నదమ్ములన్నారు. టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మూడుచోట్ల లోకేశ్ సభలు

ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తూర్పు నియోజకవర్గ పరిధిలోని అప్పుఘర్ వద్ద గల గాదిరాజు ప్యాలెస్ సమీపాన, రెండు గంటలకు విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఏర్పాటుచేసే సభల్లో లోకేశ్ పాల్గొంటారు. అక్కడ నుంచి సాయంత్రం ఐదు గంటలకు విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని గోపాలపట్నం పెట్రోల్ బంకు సమీపాన వెంకటాపురంలో నిర్వహించనున్న సభలో పాల్గొంటారు. ఆదివారం రాత్రి విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని బిర్లా జంక్షన్ సమీపాన గల హోండా షోరూమ్ వద్ద బస చేస్తారు.

ఉత్తరాంధ్రకు పట్టిన దరిద్రం జగన్

... 5వ పేజీ తరువాయి

తీసుకువస్తే జగన్ బూమ్‌బూమ్, ప్రెసిడెంట్ మెడల్ వంటి మద్యం బ్రాండ్లు తీసుకువచ్చారన్నారు.

నవ మోసాలు: ఎన్నికల ముందు నవరత్నాలు అని ఊదరగొట్టిన జగన్, అధికారంలోకి వచ్చిన తరువాత దానిని నవ మోసాలుగా చేశారని లోకేశ్ ధ్వజమెత్తారు. మద్య నిషేధం చేసిన తరువాతే ఓట్లు అడుగుతానని ప్రజలను నమ్మించిన వ్యక్తి... మాట తప్పడమే కాకుండా నేడు వీధివీధినా మద్యం అమ్ముతున్నారన్నారు. ప్రజల కష్టాలు చూసి చంద్రబాబు సూపర్ సిక్స్ ప్రకటించారని గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేస్తామని ప్రకటించారు. బూత్ స్థాయి అధ్యక్షులు, ముఖ్యమైన నాయకులు రానున్న రెండు నెలల్లో ప్రజల్లోకి వెళ్లి సూపర్ సిక్స్ కోసం ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. సభలో పెందుర్తి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బండారు సత్యనారాయణమూర్తి, జనసేన రూరల్ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడారు. అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి కేడర్‌కు లోకేశ్ సూపర్ సిక్స్ కిట్లు పంపిణీ చేశారు.

తహసీల్దార్ రమణయ్య బంధువు రాజేంద్ర మృతి

... 5వ పేజీ తరువాయి

తరలించారు. ఇదిలావుండగా తహసీల్దార్ బంధువుగా చెప్పుకుంటున్న ప్రధాన రాజేంద్ర శుక్రవారం మృతిచెందడం చర్చనీయాంశంగా మారింది. పోలీసులు, ప్రసాద్, తదితరుల ఒత్తిళ్లను తట్టుకోలేకే రాజేంద్ర మృతిచెందాడంటూ ప్రచారంజరిగింది. అయితే రాజేంద్ర భార్య త్రివేణి మాత్రం తన భర్తకు గుండెపోటు రావడం వల్లే మృతిచెందారని, ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదని స్పష్టంచేశారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కోటపాటు కొత్తూరుకు చెందిన ప్రధాన రాజేంద్ర పదేళ్ల కిందట విశాఖ వచ్చి ఎంవీపీకాలనీలోని గాదిరాజు ఎంపైర్స్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. భార్య త్రివేణితోపాటు ఏడేళ్ల కుమార్తె ఉంది. రాజేంద్ర కొంతకాలం కిందటి వరకూ అనకాపల్లిలో మహీంద్ర ట్రాక్టర్ల షోరూమ్ నిర్వహించేవారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కొనసాగుతున్నారు. కాగా త్రివేణి కథనం ప్రకారం...మధుమేహం కలిగి ఉన్న రాజేంద్ర శుక్రవారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఒక్కసారిగా షుగర్ లెవెల్స్ పెరిగిపోవడంతో కుప్పకూలిపోయారు. వెంటనే షీలానగర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించామని, అక్కడ చికిత్స పొందుతూ రాత్రి పది గంటల సమయంలో మృతిచెందారు. కార్డియాక్ అరెస్టు వల్లే రాజేంద్ర మృతిచెందినట్టు వైద్యులు కూడా నిర్ధారించారన్నారు. తన భర్త అంత్యక్రియలు కూడా పూర్తయినందున ఆ విషయాన్ని అక్కడితో వదిలేయాలని ఆమె కోరారు. తన భర్త మృతి చెందడంతో ఏడేళ్ల కుమార్తెతో ఎలా బతకాలో తెలియని స్థితిలో ఉన్న తమను కొన్ని టీవీ ఛానల్స్ తప్పుడు వార్తలు ప్రసారం చేసి మనోవేదనకు గురిచేస్తున్నారని వాపోయారు. ఏదైనా లేనిపోని అనుమానాలతో కథనాలు ప్రసారం చేస్తే ఆయా మీడియా సంస్థల పేరు చెప్పి తన కుమార్తెతో కలిసి ఆత్మహత్య చేసుకోవడం ఒక్కటే తనకు మార్గమని త్రివేణి ఆవేదన వెళ్లగక్కారు.

కారు బీభత్సం

... 5వ పేజీ తరువాయి

వచ్చి డ్రైవర్‌ను తనతో తీసుకువెళ్లేందుకు యత్నించాడు. పోలీసులు అడ్డుకోవడంతో వారితో వాగ్వాదానికి దిగాడు.

మద్యం మత్తులోనే...?

కారు డ్రైవర్ అలజంగి గణేష్ మత్తుగా ఉండడంతో పాటు ఏమి జరిగిందో తెలియని స్థితిలో ఉండడాన్ని స్థానికులు గమనించారు. అతడు మద్యం సేవించి ఉన్నాడని చెబుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత అతడిని స్థానికులు విచారించగా తనది పెదవాల్తేరని, పెళ్లిలో కారు నడిపేందుకు ఆఫ్టింగ్ డ్రైవర్‌గా వచ్చానని తెలిపాడు. రాత్రంతా మద్యం సేవించానని వివరించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ ఎస్ఐలు బి.తిరుపతిరావు, వి.కనకారావు, ఏఎస్ఐ ప్రసాద్ వివరాలను సేకరించారు. గాయపడిన లక్ష్మణ్, డ్రైవర్ గణేష్‌లను ఆస్పత్రికి తరలించారు. జగదీశ్వరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురికి తరలించారు.

తల్లడిల్లిన తనయుడు

నక్కవానిపాలెం రామాలయం వీధికి చెందిన జగదీశ్వరి అలియాస్ జగదీ కూలీ. ఆమె భర్త పదేళ్ల కిందటే అనారోగ్యంతో మృతి చెందాడు. కుమారుడు పోలిశెట్టి గణేష్‌తో కలిసి జీవిస్తోంది. తన రెక్కల కష్టంతో అతడిని ఇంటర్ చదివిస్తోంది. ప్రమాదంలో తల్లి మృత్యువాత పడడంతో కుమారుడు గణేష్ బోరున విలపిస్తున్నాడు. ఉన్న ఒక్కగానొక్క ఆధారం తిరిగిరాని లోకాలకు తరలిపోయిందని, ఈ లోకంలో తనకంటూ ఇంకెవరూ లేరని, ఎలా బతకాలని, ఎవరు చదివిస్తారని వెక్కివెక్కి ఏడుస్తున్న అతడిని ఓదార్చడం ఎవరితరం కావడం లేదు.

డ్రైవర్‌కు ఫిట్స్?

ఆఫ్టింగ్ డ్రైవర్‌గా వచ్చిన గణేష్‌కు కారు నడుపుతుండగా ఫిట్స్ రావడంతోనే ప్రమాదం జరిగిందని కారు యజమాని చెబుతున్నాడు. అయితే కేసు తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిట్స్ వస్తే కారును అంతదూరం ఎలా నడిపాడని, ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్‌ను కారులోనుంచి తామే బయటకు తీశామని, అప్పుడు మామూలుగానే ఉన్నాడంటున్నారు. ఫిట్స్ వస్తే నోటిలో నురగలు కూడా వస్తాయని, కేసు నుంచి తప్పించేందుకే యజమానితప్పుడు సమాచారం ఇస్తున్నాడని చెబుతున్నారు.

'అవినీతి రహిత పాలనే ధ్యేయం'

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 17: అవినీతి రహిత పాలనే ధ్యేయంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆల్ తెలుగు ప్రజా పార్టీ ఏర్పాటుచేసినట్టు ఆల్ తెలుగు ప్రజా పార్టీ విశాఖ పార్లమెంట్ పరిశీలకురాలు ఎన్.సంధ్యా అన్నారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏటీపీపీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రినిచేయడమే ధ్యేయమన్నారు. ఇప్పటివరకు ఉన్నపార్టీలు అవినీతిని ప్రోత్సహిస్తూ ప్రజా సంక్షేమాన్ని గాలికివదిలేసి కుటుంబ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ స్థితిలో తమతో కలిసి వచ్చే పార్టీలను కలుపుకొని ముందుకు వెళ్తామన్నారు. నేతలు సాయేశ్వరరావు,గంటిమోహనరావు పాల్గొన్నారు.

'విశ్వబ్రాహ్మణులకు 'దక్షిణ' టికెట్ ఇవ్వాలి'



మాట్లాడుతున్న విశ్వబ్రాహ్మణ సంఘాల నేత అప్పలాచారి

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 17: దక్షిణ నియోజకవర్గంలో అత్యధిక శాతం ఉన్న విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గానికి ప్రధాన రాజకీయ పార్టీలు ప్రాధాన్యత కల్పించి వచ్చే ఎన్నికల్లో టికెట్లు కేటాయించాలని విశ్వబ్రాహ్మణ మహాసేన (బీసీ) ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ నేత తాళాబత్తుల అప్పలాచారి మాట్లాడారు. ఇప్పటి వరకు విశ్వబ్రాహ్మణులకు ఏ పార్టీ సరైన గుర్తింపు ఇవ్వలేదని విచారం వ్యక్తం చేశారు. విశ్వబ్రాహ్మణుల జనాభా ఆంధ్రప్రదేశ్‌లో 24 లక్షల మంది ఉన్నారన్నారు. కాశీ సన్యాసిరాజు, కె. సూర్య, ఎ.శ్రీనివాస్ మాట్లాడారు. శివకోటి వాసు, గోడి నరసింహాచారి, విశ్వబ్రాహ్మణ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళాబత్తుల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బోదలపాటి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కెమికల్ విద్యార్థులకు పురస్కారాలు



పురస్కార గ్రహీతలతో ప్రిన్సిపాల్ రమణ, పూర్వవిద్యార్థులు

కంచరపాలెం, ఫిబ్రవరి 17: స్థానిక ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగేళ్లలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు శనివారం ప్రతిభా పురస్కారాల ప్రదానం చేశారు. తొలుత బ్యాచ్ (1971-75) నుంచి నేటి వరకు కళాశాల కళాశాలలో చదువుకుని ఉన్నతస్థాయిలో ఉన్న పూర్వవిద్యార్థులు ముందుగా ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు కళాశాలతో తమ అనుబంధాన్నినెమరువేసుకున్నారు. కళాశాలకు తాము అందిస్తున్న సహకారాన్ని వివరించారు. కెమ్‌దోసా అధ్యక్షుడు ఎ.వరహాలు, కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డా.బి.దేముడు పాల్గొని వారి అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం మెరిట్ విద్యార్థులకు రూ.90 వేలు నగదు పోత్సాహకంగా అందించారు. ప్రస్తుతం చదువుతున్న వారిలో ప్రేరణ కల్పించారు.

'టీడీపీ ఉత్తర కన్వీనర్‌గా 'పాలమరశెట్టి'ను నియమించాలి'

మర్రిపాలెం, ఫిబ్రవరి 17: ఉత్తర నియోజకవర్గ టీడీపీ కన్వీనర్‌గా పార్టీ నాయకుడు, విశాఖ పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి పాల మరశెట్టి శ్రీనివాసరావును నియమించాలని కోరుతూ ఉత్తర నియోజకవర్గంలో పలు వార్డుల అధ్యక్షులు, కార్యదర్శులు తీర్మానం చేశారు. ఈమేరకు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, శ్రీనివాసరావు ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా పార్టీ కోసం అహర్నిశలు పని చేస్తున్నారన్నారు. ఆయన సేవలను గుర్తించి ఉత్తర నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్తగా పార్టీ అధిష్ఠానం సముచితస్థానం కల్పించాల ని వారు కోరారు.

ఈతలపాక సుజాత వినతి

అక్కయ్యపాలెం: ఉత్తర నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా తనను నియమించాలని తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ తనను నియమిస్తే పార్టీని బలోపేతం చేసి మరింత ముందుకు తీసుకెళ్తానని చెప్పారు. కార్యకర్తలు, నాయకుల సమన్వయంతో ఎన్నికల్లో టీడీపీ విజయానికి తనవంతు శ్రమిస్తానన్నారు.

మిలాన్ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ

- 21, 22 తేదీల్లో వాహనాల మళ్లింపు
- కొన్ని మార్గాల్లో రాకపోకలపై నిషేధం

మహారాణిపేట, ఫిబ్రవరి 17: విశాఖలోని ప్రతిష్టాత్మకమైన మిలాన్- 2024 నిర్వహిస్తున్న సందర్భంగా ఈ నెల 21, 22 తేదీల్లో నగరంలో ట్రాఫిక్ నియంత్రిస్తున్నారు. శనివారం పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీపీ వి.ఎన్. మణికంఠ అందించిన వివరాలివి.. ఈ నెల 21, 22 తేదీల్లో ఉపరాష్ట్రపతి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రులు మిలాన్ నేపథ్యంలో నగరానికి రానున్నారు. అందువల్ల భారీ వాహనాల రాకపోకలు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ , షీలానగర్ నుంచి కాన్వెంట్ జంక్షన్ , కాన్వెంట్ జంక్షన్ నుండి సింధియా వైపు రహదారులపై రాకపోకలను నిషేధించనున్నారు. ఈ సమయంలో తమ వాహనాలను పార్కింగ్ ప్రదేశాలు, తమ యార్డులలో మాత్రమే నిలపాల్సి ఉంటుంది. ఐఎన్ఎస్ శాతవాహన, కృష్ణ, కాకతీయ గేట్ల వద్ద డాక్‌యార్డు ఉద్యోగుల తమ వాహనాలను పార్కింగ్ చేయడానికి వీలులేదు.

బీచ్ రోడ్డులో....

ఈ నెల 20, 22 తేదీలలో నగరంలోని రామకృష్ణా బీచ్ రోడ్డు నుంచి నేవల్ కోస్టల్ బ్యాటరీ వరకు మధ్యాహ్నం ఒంటి నుంచి రాత్రి 8 గంటల వరకు వాహనాల రాకపోకలు నిషేధించారు. పాస్‌లు కలిగిన వాహనదారులు, సమీపంలో నివసిస్తున్న వారు పోలీసుల సూచనలు పాటించాల్సి ఉంది. పాస్‌లు కలిగిన వాహనదారులు ఏపీఐఐసీ గ్రౌండ్‌లో పార్కింగ్ చేయాలి. పాస్‌లులేనివారు తమ వాహనాలను ఎంజీఎం పార్కులోని ఆంధ్రా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో పార్కింగ్ చేసి, కాలినడకన బీచ్‌లోకి చేరుకోవాల్సి ఉంటుంది.


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

రేకుల ఇల్లు దగ్ధం: రూ.10 లక్షల ఆస్తి నష్టం

వేపగుంట, ఫిబ్రవరి 17: జీవీఎంసీ 98వ వార్డు పరిధి అప్పన్నపాలెం పోలిపిల్లి అమ్మవారి గుడి సమీపంలో ఉన్న సిమెంటు రేకుల ఇంట్లో షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. బొట్టా పైడమ్మ అనే మహిళ కూలి పనులు చేస్తూ ఇక్కడ నివసిస్తుంది. ఆమె భర్త మృతి చెందగా, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నాలుగు రోజుల క్రితమే ఒక కుమార్తెకు పెళ్లి చేసింది. వివాహ సర్టిఫికెట్ కోసమని సింహాచలంలోని కల్యాణ మండపానికి శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి వారు వెళ్లారు. ఇంతలోనే తమ ఇల్లు కాలిపోతున్నట్టు తెలియడంతో వారు ఇంటికి వచ్చేసరికే సామాన్లన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. సారె సామగ్రి కొనేందుకు ఉంచిన రూ.మూడు లక్షల నగదు, కట్నానికి సంబంధించిన డబ్బు, 30 తులాల వెండి, కొంత బంగారం కాలి బూడిదైపోయాయని కన్నీరుమున్నీరుగా వారు విలపిస్తున్నారు. ప్రమాద సమయంలో గ్యాస్ సిలిండర్ పేలడంతో ప్రమాద తీవ్రత అధికమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.

మహిళల సంక్షేమానికి కృషి: ఎమ్మెల్యే

సబ్బవరం, ఫిబ్రవరి 17: మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. సీఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.సూర్యకుమారి, వైసీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబు, ఎంపీటీసీ దేముడు బాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు శేషుబాబు, నాయకులు సురేశ్‌రాజ్, కొటాన రాము, తదితరులు పాల్గొన్నారు.

'సింహాద్రి'ని సందర్శించిన కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి

పరవాడ, ఫిబ్రవరి 17: సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి (బొగ్గు మంత్రిత్వ శాఖ) ఎం.నాగరాజు శనివారం సందర్శించారు. ఆయనకు ఓఅండ్ఎం విభాగం జీఎం డీపీ పాత్ర స్వాగతం పలికారు. అనంతరం అదనపు కార్యదర్శి ప్లాంట్‌లోని కంట్రోల్ రూమ్, వ్యాగన్, ఫిల్టర్ ఏరియా, యాష్ డైక్ ఏరియా, ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, సీ వాటర్ పంపింగ్ హౌస్‌లను సందర్శించారు. ప్లాంట్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన సముద్రతీర అతిథి గృహం ప్రాంతంలో మొక్కలు నాటారు. సంస్థలోని వివిధ విభాగాల జీఎంలు ఎస్.పద్మప్రియా, పి. రాజగోపాలన్, కేజే రావు, హెచ్‌ఆర్ హెడ్ టీటీ పాత్ర పాల్గొన్నారు.

'కార్మిక వ్యతిరేక విధానాలను వీడాలి'

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 17: కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విడనాడాలని ఇంటక్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. శనివారం ప్లాంట్‌లో జరిగిన మావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్‌లకు అప్పగించడం, కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేయడం, ఇలా అన్నివిధాల అన్యాయం చేస్తుందన్నారు. కార్మికులకు వేతన సవరణ చేయకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీఎంకే నాయక్, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌వీ నాయుడు, కొమ్ము ప్రసాద్, డి.మోహన్, ఎ.నూకరాజు, బీటీ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శారదా పీఠం వారోత్సవాలు

పెందుర్తి, ఫిబ్రవరి 17: శారదా పీఠం వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం పీఠం యాగశాలలో మహారుద్ర సహిత లక్షమూల మంత్ర రాజశ్యామల యాగాన్ని రుత్వికులు ఘనంగా నిర్వహిస్తున్నారు. వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిలను ప్రత్యేకంగా అలంకరించగా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి హారతులిచ్చారు. యాగశాలలో మన్యుసూక్త వనదుర్గ హోమాలు చేయడంతో పాటు చంద్రమౌళీశ్వరులకు పీఠార్చన, పీఠం ప్రాంగణంలోని దేవతామూర్తులకు అభిషేకాలు జరిపారు. టీటీడీ చేపట్టిన వేంకటేశ్వర హవనానికి పీఠాధిపతి హారతులిచ్చారు. సాయంత్రం టీటీడీ పండితులు శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహించారు.

హెలిప్యాడ్ ఏర్పాటుకు స్థల పరిశీలన

పెందుర్తి, ఫిబ్రవరి 17: చినముషిడివాడలోని శారదాపీఠం వార్షికోత్సవాల ముగింపు కార్యక్రమానికి సీఎం జగన్ హాజరవుతారన్న సమాచారంతో రెవెన్యూ, పోలీసు అధికారులు చర్యలు చేపడుతున్నారు. సీఎం హెలికాప్టర్‌లో ఇక్కడకు వస్తారన్న సీఎంవో సమాచారంతో హెలిప్యాడ్ ఏర్పాటుకు అనువైన స్థలం కోసం పెందుర్తి, పురుషోత్తపురం, పినగాడి, చినముషిడివాడల్లో పలు ప్రాంతాలను పరిశీలించారు. అయితే ఈ స్థలాలు అనువైనవి కావంటూ జిల్లా ఉన్నతాధికారుకు వివరించినట్టు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. కాగా సీఎం విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గంలో శారదా పీఠానికి రానున్నట్టు అధికారులు భావిస్తున్నారు. సీఎం పర్యటన అధికారికంగా ఖరారు కాలేదని పీఠం వర్గాలు చెబుతున్నాయి.

పంచగ్రామాల భూ సమస్యను గాలికొదిలేసిన జగన్

శంఖారావ సభలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

యోధుడిలా సాగిన లోకేశ్ పాదయాత్ర: జనసేన నేత పంచకర్ల


శంఖారావ సభలో మాట్లాడుతున్న బండారు, పంచకర్ల

పెందుర్తి/వేపగుంట, ఫిబ్రవరి 17: సింహాచల దేవస్థాన పరిధిలోని పంచగ్రామాల భూ సమస్యను సీఎం జగన్ గాలికొదిలేశారని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి విమర్శించారు. పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని కృష్ణరాయపురం ఎగ్జిబిషన్ మైదానంలో జరిగిన లోకేశ్ శంఖారావం సభలో ఆయన టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని, వైసీపీ ప్రభుత్వ పాలనలో కుంటుబడిన అభివృద్ధి గురించి గణాంకాలతో వివరించారు. పంచగ్రామాల భూ సమస్య కోసం టీడీపీ ప్రభుత్వం జీవో-578 తేవడంతో తొమ్మిది వేల ఇళ్ల క్రమబద్ధీకరణ చేయడం జరిగిందన్నారు. అయితే దివంగత వైఎస్ సీఎం అయ్యాక టీడీపీ జీవోను రద్దు చేశారని ఆరోపించారు. 2014లో మళ్లీ టీడీపీ ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారం కోసం శాసన సభలో చట్టం చేసి మరో జీవో తెస్తే.. జగన్ న్యాయవాదులచే కోర్టు నుంచి స్టే తెచ్చి అడ్డుకున్నారని మండిపడ్డారు. అలాగే ముదపాకలో రైతుల నుంచి జరిపిన ల్యాండ్ పూలింగ్‌లో భారీ అవినీతికి వైసీపీ నేతలు పాల్పడ్డారని బండారు ఆరోపించారు. వంగలిలో పెట్రో యూనివర్సిటీ అమలుకు నోచుకోలేదని, పరవాడ మండలంలోని కాలుష్య గ్రామం తాడి తరలింపునకు నోచుకోలేదన్నారు. వేపగుంటలో వుడా ఆధీనంలో ఉన్న 150 ఎకరాల భూ సమస్యను పరిష్కరించాలని లోకేశ్‌ను కోరారు. కాగా స్థానిక ఎమ్మెల్యే బిల్డప్ బాబాయ్ అని, ఆయన చేసేదంతా అవినీతేనని బండారు విమర్శించారు. రాంపురంలో వీర్రాజు చెరువుకు తప్పుడు పత్రాలతో సృష్టించి ఆక్రమించారని, ఇక్కడ పని చేసిన ముగ్గురు తహసీల్దార్ల అవినీతి గురించి రెడ్ బుక్‌లో నోటు చేసుకోవాలని లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు.


లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

దోచుకోవడం..దాచుకోవడమే వైసీపీ నైజం

గతంలో ఎంతోమంది రాజకీయ నాయకులు పాదయాత్ర చేసినప్పుడు అప్పటి ప్రభుత్వాలు సహకరించాయని, కానీ లోకేశ్ పాదయాత్రకు అడుగడుగునా వైసీపీ ప్రభుత్వం అడ్డంకులను సృష్టించినా ఆయన యోధుడిలా ముందుకు సాగారని జనసేన పార్టీ విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. తాను చేపట్టిన పాదయాత్ర ద్వారా లోకేశ్ పరిణితి చెందిన నాయకునిగా ఉద్భవించారన్నారు. దోచుకోవడం.. దాచుకోవడం అన్న రీతిలో జగన్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని విమర్శించారు. వైసీపీ అరాచకాలకు చరమగీతం పాడాలంటే టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. పెందుర్తి నియోజకవర్గంలో టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప కొత్తగా ఏమీ జరగలేదన్నారు.

లోకేశ్‌కు కార్పొరేటర్ల వినతి

సింహాచల పంచగ్రామాల భూ సమస్య, వేపగుంటలోని వుడా భూములు, తదితర సమస్యలపై దృష్టి సారించాలని కోరుతూ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్, కార్పొరేటర్లు రాపర్తి కన్నా, బల్ల శ్రీనివాసరావు, సేనాపతి వసంత శంకరరావులు లోకేశ్‌కు వినతిపత్రం అందజేశారు.

గాజువాక శంఖారావం సభను విజయవంతం చేయాలి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, ఫిబ్రవరి 17: ఇక్కడి లంకా మైదానంలో ఈ నెల 19న తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టనున్న శంఖారావ సభను విజయవంతం చేయవలసిందిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కోరారు. జనసేన కార్యాలయానికి శనివారం ఆయన వెళ్లి ఈ సభకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు, జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు మాట్లాడుతూ దగా పడిన రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు పోరాటాలు తప్పవని, రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. సీఎం జగన్ చేస్తున్న అరాచక పాలనకు చరమగీతం పాడాలంటే టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, నాయకులు పులి వెంకటరమణారెడ్డి, బలగ బాలునాయుడు, పప్పు శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.


ఐక్యతను చాటుతున్న పల్లా శ్రీనివాసరావు, కోన తాతారావు, తదితరులు

సభా స్థలిలో ఏర్పాట్లు పరిశీలన

శంఖారావ సభ నిమిత్తం లంకా మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను పల్లా శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు పరిశీలించారు. ఈ సభకు అధిక సంఖ్యలో ప్రజలు రానున్నందున ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని, సభను విజయవంతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బొండా జగన్, నల్లూరు సూర్యనారాయణ, పల్లా శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

అధిక సంఖ్యలో తరలిరావాలి

కూర్మన్నపాలెం: ఈ నెల 19న గాజువాక లంకా గ్రౌండ్స్‌లో జరగనున్న లోకేశ్ శంకారావ సభను సక్సెస్ చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ విజ్ఞప్తి చేశారు. 87వ వార్డు వడ్లపూడిలోని టీడీపీ కార్యాలయం వద్ద శనివారం రాత్రి జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలుకుతామన్న సందేశాన్ని వైసీపీకి ఇచ్చేలా అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు ఈ సభకు హాజరవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల ప్రచారం

గోపాలపట్నం: స్థానిక బంక్ కూడలిలోని సంత ప్రాంగణం సమీపంలో ఆదివారం సాయంత్రం జరగనున్న నారా లోకేశ్ శంఖారావ సభను సక్సెస్ చేయాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేశారు. ఇప్పటికే ప్రధాన రహదారిలో పార్టీ జెండాలు, ఫ్లెక్సీలను అధికంగా ఏర్పాటు చేశారు. గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో టీడీపీ వార్డు కమిటీ సభ్యులు సభకు తరలిరావాలంటూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం సాగించారు. పురవీధుల్లో కరపత్రాలను పంపిణీ చేస్తూ అందరినీ సభకు ఆహ్వానించారు.



ఎక్స్‌కవేటర్‌తో రహదారిని తొలగిస్తున్న దృశ్యం

పంట కాలువలో నుంచి వేసిన రహదారి తొలగింపు

పరవాడ, ఫిబ్రవరి 17: భరిణికం రెవెన్యూ పరిధి సర్వే నంబర్-180, 181లలో గల ప్రధాన పంట కాలువను పూడ్చి ఏర్పాటు చేసిన రహదారిని రెవెన్యూ అధికారులు శనివారం ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు. గ్రామానికి చెందిన ముగ్గురు వైసీపీ నాయకులు సొంత భూముల రోడ్డు కోసం పంట కాలువ పూడ్చివేసిన వైనంపై 'వైసీపీ నేతల బరితెగింపు' శీర్షికతో ఈ నెల 14న 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై జేసీ ఆదేశాల మేరకు పరవాడ తహసీల్దార్ గణపతిరావు పర్యవేక్షణలో రోడ్డు తొలగింపు పనులు చేపట్టారు. పోలీస్ సిబ్బంది పర్యవేక్షణలో పనులను ప్రారంభించారు. సుమారు అర కిలోమీటరు మేర పంట కాలువను పూడ్చివేసి రహదారిని ఏర్పాటు చేయడంతో పూర్తిస్థాయిలో రహదారిని తొలగించాలని భావించారు. ఇందుకోసం ఉదయం పది గంటలకు పనులు ప్రారంభించి సాయంత్రం నాలుగు గంటల వరకు చేపట్టారు. ఆర్ఐ గఫూర్, వీఆర్వోలు బి.శ్రీనివాసరావు, టి.వెంకటేశ్వరరావు, రాము, నాగరాజు పాల్గొన్నారు.

'తెలుగును గౌరవిస్తూనే ఆంగ్లం నేర్చుకోండి'

మల్కాపురం, ఫిబ్రవరి 17: తెలుగు భాషను గౌరవిస్తూనే ఆంగ్లం నేర్చుకోవడం ఎంతో అవసరమని వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. మేధా చిరంజీవి ఆధ్వర్యంలో షీలానగర్‌లోని విశాఖ డెయిరీ స్కూల్ ఆడిటోరియంలో వలంటీర్లకు నిర్వహించే ఈజీ ఇంగ్లిష్-ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొద్ది రోజుల క్రితం పారిశ్రామిక ప్రాంతంలో నిర్వహించిన జాబ్ మేళాలో పలువురు నిరుద్యోగ యువత ఇంగ్లిష్ రాక ఉద్యోగాలు పొందలేకపోయారని, అందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గలవారు 9000818467, 9000938467 సెల్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు మిలినీయం శ్రీధర్‌రెడ్డి, వైసీపీ పశ్చిమ పరిశీలకుడు రెహమాన్, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

మావి జిరాయితీ భూములేనంటూ ఏఈకి రైతుల వినతి

సబ్బవరం, ఫిబ్రవరి 17: మండలంలోని మొగలిపురం సర్వే నంబర్-43లో 6.90 ఎకరాల పక్కా జిరాయితీ భూములంటూ సుమారు 30 మంది రైతులు శనివారం ఇరిగేషన్ ఏఈ రామలక్ష్మణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 16న 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రకృతి విధ్వంసం' కథనం ప్రచురితమైన నేపథ్యంలో వారు ఏఈని కలిసి తాతలు, తండ్రుల కాలం నుంచి సదరు జిరాయితీ భూములను పంచుకోలేదన్నారు. వ్యవసాయ కూలీ రేట్లు పెరగడం వల్ల కొన్నేళ్లుగా వ్యవసాయం చేయడం లేదన్నారు. ఇటీవల సదరు భూములను పంచుకుని చదును చేసుకోవడం జరుగుతుందన్నారు. రీ-సర్వేలో కూడా తమ హక్కు పత్రాలు (ఎఫ్ఎంబీ) చూపించి, రెవెన్యూ రికార్డుల్లో తమ పేర్లు నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. సర్వే నంబర్-29, 45ల్లో గెడ్డ వాగుల నుంచి నీరు లాలంవారి చెరువుకు వెళ్తుందే తప్ప తమ పొలాల్లోకి రాదన్నారు. అందువల్ల సమగ్ర దర్యాప్తు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు గండి అప్పలనాయుడు, కె.దేముడు, జీకే నాయుడు, జి.దేముడుబాబు, బండయ్య, రమణ, బాలు, తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మంపై విద్యార్థులకు అవగాహన

అగనంపూడి, ఫిబ్రవరి 17: స్థానిక గొన్నవానిపాలెంలోని గొన్నా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సనాతన ధర్మంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమం నుంచి స్వామి శ్వసం వైద్యానంద ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మానికి మన నిత్య జీవితంలో ఎంత ప్రాముఖ్యత ఉందో వివరించారు. కార్యక్రమంలో గొన్నా విద్యా సంస్థల కార్యదర్శి గొన్నా హేమచంద్‌నాయుడు, ప్రిన్సిపాల్ పీఎస్ఎన్. మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌పీసీఎల్‌లోకి 2 భారీ యంత్రాలు తరలింపు

సింధియా, ఫిబ్రవరి 17: హెచ్‌పీసీఎల్ విస్తరణ పనులు చురుగ్గా జరుగుతున్న నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి రెండు భారీ యంత్రాలను నాలుగు పెద్ద ట్రాలీ వాహనాల ద్వారా తరలించారు. షిప్‌యార్డుకు చేరుకున్న ఈ రెండు యంత్రాలను హెచ్‌పీసీఎల్‌లోకి తరలించేందుకు నాలుగు భారీ ట్రాలీ వాహనాలను వినియోగించారు. ఒక్కో ట్రాలీ వాహనానికి అరవై చొప్పున టైర్లు ఉన్నాయి. రెండు ట్రాలీలపై ఒక్కో యంత్రాన్ని ఉంచి నెమ్మదిగా హెచ్‌పీసీఎల్‌లోకి తరలించారు. మార్గమధ్యంలో వాహనాలకు అడ్డంకిగా ఉన్న చెట్ల కొమ్మలను నరుక్కుంటూ సిబ్బంది ముందుకు సాగారు. అర్ధరాత్రి వేళలో ఈ యంత్రాలను తరలించినప్పటికీ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి పలు వాహనాలు బారులుతీరి నిలిచిపోయాయి.

సాయినాథునికి క్షీరాభిషేకం



కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 17: జీవీఎంసీ 86వ వార్డు పరిధి శాతవాహననగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు వెంకట శ్రీధర్ స్వామి ఆధ్వర్యంలో సాయినాథునికి 216 కలశాలతో సుమారు వెయ్యి లీటర్లతో క్షీరాభిషేకాన్ని భక్తుల చేతుల మీదుగా నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమాలను చేశారు. అలాగే తెల్లవారుజామున సాయిబాబాను వెండి పల్లకీలో ఊరేగిస్తూ దత్తసాయి భజన కమిటీ ఆధ్వర్యంలో సంకీర్తనలను ఆలపించారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. కాగా పది కిలోల ప్రసాద లడ్డూను రూ.85 వేలకు కాట్రగడ్డ దుర్గాప్రసాద్ అనే భక్తుడు వేలం పాటలో సొంతం చేసుకున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల నడుమ సాయినాథున్ని పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో దత్తసాయి మందిర కమిటీ ప్రతినిధులు బి.శేషగిరిరావు, కె.దుర్గాప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, పి.ధనుంజయరెడ్డి, వి.రామచంద్రరావు, సాయిరామ్, జగపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20, టమాటా 18, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 50, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 44, బీరకాయలు 46, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 22, క్యాబేజీ 22, క్యారేట్ 24, దొండకాయలు 40, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది) 106, బరబాటి 28, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 40, దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 55, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 52, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, క్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 115
ఫారం ధర	-- 135
విత్ స్కిన్	-- 240
స్కిన్‌లెస్	-- 250

మరికొన్ని సిటీ వార్తలు పేజీ IIIలో..


దీక్షా శిబిరంలో మంత్రి రాజశేఖర్, తదితరులు

ప్రభుత్వ రంగాలకు హాని చేసే పార్టీలకు బుద్ధి చెప్పాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 17: ప్రభుత్వ రంగాలకు హాని తలపెట్టిన పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1,101వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియను నిలిపివేస్తామని కేంద్రం ప్రకటించేంత వరకు తమ పోరాటాలు ఆగవని స్పష్టం చేశారు. మరో చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు ఊపిరిని ఆపేందుకు అవాంతరాలు సృష్టిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ ప్రక్రికయకు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం అంతర్లీనంగా సహకరిస్తూ దుశ్చర్యలకు పాల్పడుతుందని మండిపడ్డారు. జాతి సంపదైన విశాఖ ఉక్కును పోరాటాలతో కాపాడుకుంటామన్నారు. నాయకులు సన్యాసిరావు, వెంకటేశ్వరరావు, పరంధామయ్య, రామస్వామి, గంగవరం గోపి, తదితరులు పాల్గొన్నారు.

'లోకేశ్ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలి'

పెదగంట్యాడ, ఫిబ్రవరి 17: పాత గాజువాక లంకా మైదానంలో సోమవారం జరగనున్న లోకేశ్ శంఖారావం సభకు పెదగంట్యాడ మండలం నుంచి అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి కోరారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపే ధ్యేయంగా అందరూ పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు నమ్మి అప్పారావు, శ్రీముసిరి శ్రీనివాసరావు, ములకలపల్లి పెంటయ్య, గోక్యాడ ముత్యాలు, మొల్లి రమణ, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

శ్రీనగర్, ఫిబ్రవరి 17: జనసేన-టీడీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా జనసైనికులు శ్రమించాలని జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు కోరారు. శ్రీనగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. జనం వద్దకు జనసేన అంటూ ఆదివారం 87వ వార్డులో పాదయాత్ర చేపట్టనున్నామని, నాయకులు, జనసైనికులు, వీరమహిళలు ఇందులో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు గడసాల అప్పారావు, కరణం కనకారావు, సిరసపల్లి కనకరాజు, కాదా శ్రీను, గంధం వెంకట్రావు, లంకల మురళీ దేవి, జ్యోతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేవీలో ప్రవేశాలను పునరుద్ధరించాలి

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 17: వేలాది మంది విద్యార్థులను ప్రతిభావంతులను చేసి దేశానికి అందించిన స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయాన్ని మూసివేసేందుకు చర్యలు చేపట్టడం దారుణమని యూజ్ ప్రధాన కార్యదర్శి కె.పరంధామయ్య, అధ్యక్షుడు బి.కామేశ్వరరావు అన్నారు. శనివారం ప్లాంట్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేవీని మూసివేయడమంటే ఉక్కు యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం సామాజిక బాధ్యత నుంచి తప్పుకోవడమేనన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు.